

ఫామ్‌లో ఇంజనీర్



- ఉద్యోగం వదిలి కోళ్ల పెంపకం చేపట్టిన యువకుడు
- సొంతూరిలో మూడు ఎకరాల్లో ఫామ్ ఏర్పాటు
- ఒక్కో కోడి పుంజు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు విక్రయం

· 8లో

రుషికొండ బీచ్ రహదారికి మోక్షం

కొండకు దక్షిణ మార్గంలో రాకపోకల పునరుద్ధరణకు కూటమి నేతల యత్నం



రుషికొండ బీచ్‌లోకి వెళ్లకుండా మూసేసిన రహదారి

- ఇటీవల భవనం సందర్శనకు వచ్చిన సీఎంను కలిసిన స్థానిక పెద్దలు
- రోడ్డును తెరిపించాల్సిందిగా వినతి
- సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన చంద్రబాబునాయుడు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

బీచ్‌కు వెళ్లేందుకు రుషికొండ దక్షిణం వైపు గల రహదారిని అందుబాటులోకి తీసుకురానున్నారు. రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు వచ్చిన తరువాత పర్యాటకుల సంఖ్య పెరగడంతో రాకపోకలకు వీలుగా అప్పటి హరిత రిసార్ట్స్‌కు దక్షిణం వైపు నుంచి మరో మార్గాన్ని ఏర్పాటుచేశారు. ఇది సరిగ్గా రుషికొండ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉంటుంది. ఈ రహదారి నిర్మాణానికి పర్యాటక శాఖ బాగానే నిధులు వెచ్చింది. డబుల్ రోడ్డు, మధ్యలో డివైడర్, నేరుగా బీచ్‌లోకి వెళ్లే సదుపాయం ఉండడంతో వాహనాలతో వచ్చేవారు ఈ మార్గాన్ని ఉపయోగించుకునేవారు. దాంతో పర్యాటక శాఖ టోల్‌గేట్ పెట్టి డబ్బులు వసూలు చేసేది. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత రుషికొండపై ఉన్న హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి సీఎం కార్యాలయం కోసం భారీ భవనం నిర్మాణం చేపట్టింది. దీనికోసం విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో రుషికొండ వద్ద గల బస్టాప్‌లను కూడా తొలగించింది. దక్షిణ మార్గాన్ని మూసేసింది. అటువైపు ఎవరూ వెళ్లకుండా రేకులు ఏర్పాటుచేసింది. భవన నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకున్న డీఈసీ సంస్థ సిబ్బంది క్యాంపు ఆఫీసు కూడా అక్కడే ఏర్పాటు చేసుకున్నారు. ఐదేళ్లుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రుషికొండపై భవనాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలా?... అని

... మిగతా 6వ పేజీలో

టన్ను ఇసుక రూ.750

రవాణా చార్జీ టన్నుకు రూ.150

- నగరంలో మూడుచోట్ల డిపోలు
- 15 నుంచి విక్రయాలు ప్రారంభించేలా అధికారులు చర్యలు
- పది టన్నుల వరకైతే ఇక్కడ...
- అంతకుమించి కావాలంటే రీచ్‌లకు వెళ్లాల్సిందే



విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మాణదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం మూడుచోట్ల డిపోలు (స్టాకు పాయింట్లు) ఏర్పాటుచేయబోతోంది. డిపోల్లో టన్ను రూ.750కు విక్రయించనున్నారు. డిపో నుంచి వినియోగదారుని ఇంటికి రవాణా చార్జీ కింద టన్నుకు సుమారు రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. అంటే టన్ను ఇసుక వినియోగదారుడి ఇంటికి చేరడానికి రూ.900 ఖర్చవుతుంది. ఈ మేరకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

భీమిలి, ముడసర్లోవల్లో గతంలో నిర్వహించినచోటే డిపోలు ఏర్పాటుచేస్తారు. అక్కడ వెయింగ్ మిషన్లు ఉన్నాయి. అగనంపూడి వద్ద డిపో ఏర్పాటుచేసిన స్థలం ఉక్కు కర్మాగారానికి చెందినది అయినందున గాజువాక పరిసరాల్లో ఒకచోట డిపో ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. నగరంలో డిపోలు ఈనెల 15వ తేదీ నుంచి

... మిగతా 6వ పేజీలో

చికెన్ వ్యర్థాల నిర్వహణ

కాపులుప్పాడలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ముందుకువచ్చిన ఏజెన్సీ

- కాపులుప్పాడలో ఐదు ఎకరాలు కేటాయించిన జీవీఎంసీ
- ఏడాదికి రూ.1.5 కోట్లు జీవీఎంసీకి చెల్లించేలా ఒప్పందం
- చేపల చెరువులకు వ్యర్థాలు తరలించకుండా కమిషనర్ యోచన



చికెన్ వ్యర్థాలను గ్రైండింగ్ చేసి చేపల చెరువులోకి వదులుతున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఉత్పత్తి అవుతున్న చికెన్ వ్యర్థాలను పర్యావరణహితంగా ఎరువుగా మార్చేందుకు వీలుగా ప్రాసెసింగ్‌యూనిట్‌ను ఏర్పాటుచేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. యూనిట్ ఏర్పాటుకు రాజమండ్రికి చెందిన ఒక సంస్థ ముందుకురావడంతో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డు వద్ద ఐదు ఎకరాలను కేటాయించింది. యూనిట్ ఏర్పాటైతే నగరంలో చికెన్ వ్యర్థాలన్నీ చేపల చెరువులకు తరలించుకుపోయే మాఫియాకు చెక్ పడడం ఖాయమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జీవీఎంసీ పరిధిలో అధికారికంగా ఉన్న చికెన్ దుకాణాలు	1,500
అనధికారికంగా ఉన్న దుకాణాలు (అంచనా)	1,000
రోజుకు ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు	మూడు టన్నులు

నగరంలో అధికారికంగా దాదాపు 1,500 చికెన్ దుకాణాలు ఉండగా, అనధికారికంగా మరో వెయ్యి వరకూ ఉండవచ్చునని అధికారుల అంచనా. వీటన్నింటి నుంచి ప్రతిరోజూ మూడు టన్నుల వరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. చికెన్ వ్యర్థాలను కాపులుప్పాడలోని యార్డుకు తరలించే బాధ్యతను జీవీఎంసీ టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించేది. కాంట్రాక్టర్లు మొదట్లో యార్డుకు తరలించేవారు. ఆ తర్వాత జీవీఎంసీ పరిసర ప్రాంతాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాల్లోని చేపల చెరువుల నిర్వాహకులకు అమ్ముకోవడం మొదలెట్టారు. వ్యర్థాలను కాపులుప్పాడలోని యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నాసరే, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం మానేశారు. చికెన్ వ్యర్థాలను ఆహారంగా తీసుకునే చేపలను తింటే అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించినాసరే అధికారులు, కాంట్రాక్టర్లనే పట్టించుకోలేదు. చికెన్ వ్యర్థాలను సేకరణ టెండర్ల కోసం ఏకంగా ప్రజా ప్రతినిధులే రంగంలోకి దిగడం మొదలుపెట్టారు. ఇటీవల జోన్లవారీగా చికెన్ వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడలోని యార్డుకు తరలించేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. టెండర్‌ను తాము చెప్పిన వ్యక్తికి ఇవ్వాలంటూ కొంతమంది ప్రజా ప్రతినిధులు నేరుగా జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. దీంతో టెండర్లు తెరవకుండా పెండింగ్‌లో ఉంచేశారు. వీటన్నింటి నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ చికెన్ వ్యర్థాలను రాజమండ్రిలో మాదిరిగా పర్యావరణ హితంగా ఎరువుగా మార్చే

... మిగతా 6వ పేజీలో

ఏడాదిలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు

- ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు
- పెదగదిలిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన

అరిలోవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలోగా బ్యాడ్మింటన్ అకాడమీని నిర్మిస్తానని ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు స్పష్టం చేశారు. అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం గతంలో పెదగదిలిలో కేటాయించిన మూడు ఎకరాలలో గురువారం నిర్మాణ పనులకు తల్లిదండ్రులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ విశాఖ మహానగరంలో స్థలం కేటాయించి, అకాడమీ ఏర్పాటుకు ప్రోత్సహించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏడాదిలోగా నిర్మాణ పనులు పూర్తిచేస్తామని, ఐదేళ్ల నుంచి అన్ని వయసుల వారికీ బ్యాడ్మింటన్‌లో తర్ఫీదునిస్తామన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమన్నారు. తాను ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరానన్నారు. అన్ని స్థాయిల అథ్లెట్లతో క్రమ శిక్షణ గల ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దాలన్నదే తన అభిలాష అని అన్నారు. గ్రీన్‌కో భాగస్వామ్యంతో పాటు బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గోపీచంద్ మద్దతుతో అకాడమీని విభిన్నంగా తీర్చిదిద్దుతానన్నారు.



అకాడమీ నిర్మాణ పనులపై చర్చిస్తున్న పీవీ సింధు

మహా గోప్యత

- నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం
- 71 అంశాలతో అజెండా
- సమావేశం నిర్వహణపై చివరి వరకూ సమాచారం ఇవ్వని అధికారులు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు 71 అంశాలతో ఎజెండాను తయారుచేసి సభ్యులకు అందజేసినట్టు ఆయన తెలిపారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ప్రారంభం, ముగింపు వేడుకల సందర్భంగా చేసిన ఖర్చులకు బిల్లులు చెల్లింపుపై గత నెల 18న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయడంతోపాటు వాటికి సంబంధించిన రశీదులు, ఇతర ఆధారాలను అందజేయాలని

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ బడ్జెట్‌పై కసరత్తు

- ప్రతిపాదనలు పంపాల్సిందిగా అన్ని విభాగాలకు కమిషనర్ ఆదేశం
- బడ్జెట్ వాస్తవానికి దగ్గరగా ఉండాలి
- ఆదాయం, వ్యయం వివరాలను స్పష్టంగా పేర్కొనాల్సిందిగా అకౌంట్స్, ఫైనాన్స్ అధికారులకు సూచన



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి జీవీఎంసీ బడ్జెట్ తయారీపై కమిషనర్ పి.సంపత్‌కుమార్ కసరత్తు ప్రారంభించారు. బడ్జెట్ తయారీ కోసం ప్రతిపాదనలు పంపించాలని ఇప్పటికే అన్ని శాఖల విభాగాధిపతులకు ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా గురువారం సమావేశం నిర్వహించారు. శుక్రవారం నాటికి అందరూ ప్రతిపాదనలు అందజేయాలని కమిషనర్ ఆదేశించారు.

గడచిన (2024-25) బడ్జెట్‌ను ఏకంగా రూ.5,450 కోట్లతో ప్రవేశపెట్టారని, అది వాస్తవానికి దూరంగా ఉందని కొంతమంది అధికారులు ఈ సందర్భంగా అభిప్రాయపడినట్టు తెలిసింది. దీనికి కమిషనర్ స్పందిస్తూ ప్రతి విభాగం నుంచి వాస్తవ ఖర్చులు, ఆదాయాన్ని మాత్రమే అంచనా వేసి, ఆ మేరకు మాత్రమే ప్రతిపాదనలు పంపించాలని స్పష్టంచేశారు. బడ్జెట్‌ను వాస్తవానికి దగ్గరగా ఉండేలా తయారుచేయాలని అకౌంట్స్ ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీకి ఏఏ మార్గాల నుంచి ఎంతెంత ఆదాయం వస్తుందనే

... మిగతా 6వ పేజీలో

భూముల రీసర్వేకు సన్నాహాలు

గ్రామాల్లో ప్రారంభమైన సభలు

- సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపునకు ఆదేశాలు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పునః ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం 'భూ రక్ష' పేరిట భూముల రీసర్వే చేపట్టింది. ఆ పేరును ఏపీ రీసర్వే ప్రాజెక్టుగా మార్చి...పనులు కొనసాగించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతోపాటు ఇప్పటివరకూ రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, లోటుపాట్లు సవరించేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వో, ఇతర అధికారులు ఈ సభలకు హాజరవుతున్నారు. రీసర్వే సందర్భంగా రైతుల భూములకు సంబంధించిన ఇబ్బందులు, ప్రధానంగా విస్తీర్ణంలో తేడాలు, ఒకరి పేరు బదులు మరొకరి పేరు నమోదు వంటి అంశాలపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ఈనెల 25వ తేదీలోగా గ్రామ సభలు పూర్తిచేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలను వచ్చే నెల 31వ తేదీలోగా పరిష్కరించాలని తహసీల్దార్లకు ఆదేశించారు.



ఆనందపురం మండలంలో ఒక గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

పెందుర్తి, ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో మొత్తం 85 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 59 గ్రామాల్లో ఇప్పటికే రీసర్వే పూర్తిచేశారు. మరో 26 గ్రామాల్లో రీసర్వే చేపట్టాల్సి ఉంది. వీటిలో 'అన్ సెటిల్' గ్రామాలు ఏడు ఉన్నాయి. పద్మనాభం, ఆనందపురం మండలాల్లో మూడేసి, భీమిలి మండలంలో ఒక గ్రామం ఇంకా అన్‌సెటిల్‌గానే ఉంది. రీసర్వే సందర్భంగా ఈ ఏడు గ్రామాల్లో కూడా భూములు రీసర్వే చేస్తామని జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సూర్యారావు తెలిపారు. కాగా భూముల సరిహద్దులు గుర్తింపు సమయంలో పాతేందుకు గత ప్రభుత్వం సర్వే రాళ్లు తయారుచేయించింది. జిల్లాకు 89,536 రాళ్లు సరఫరా

... మిగతా 6వ పేజీలో

ఒకేసారి ఫ్లైఓవర్లు, మెట్రో

నిర్మాణానికి కిలోమీటరుకు రూ.150 కోట్ల వ్యయం

నగరంలో మొత్తం 12 ఫ్లైఓవర్లు

- లంకెలపాలెం పరిసరాల్లో రెండు, కూర్మన్నపాలెం నుంచి కొమ్మాది వరకూ మరో పది...
- పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం



- దేవస్థానానికి ఇచ్చేందుకు గాజువాక, ములగాడల్లో భూములు గుర్తింపు
- జీవీఎంసీలో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- జీవో 296 ప్రకారం పేదల స్థలాలకు త్వరలో రిజిస్ట్రేషన్
- వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు, చేర్పులు
- సీఎం హామీల అమలుకు కార్యాచరణ
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల రెండో తేదీన నిర్వహించిన సమీక్షలో చర్చించిన అంశాలు, ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ వెల్లడించారు. గురువారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా సీఎం ఇచ్చిన హామీలు, చర్చించిన అంశాలపై ప్రణాళిక శాఖ ఒక కార్యాచరణ తయారుచేసిందన్నారు. వీటి అమలుపై ప్రతి వారం సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించి పురోగతిని చర్చిస్తామన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో సీఎం చర్చించిన పలు అంశాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు.

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం, మెరుగైన రవాణా కోసం మెట్రో, ఫ్లైఓవర్ల నిర్మాణంపై ఎక్కువసేపు చర్చ జరిగిందన్నారు. మొత్తం 12 ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించామని, వీటిలో రెండు లంకెలపాలెం పరిసరాల్లో, మిగిలిన పది కూర్మన్నపాలెం నుంచి కొమ్మాది వరకు ఏర్పాటుచేస్తామన్నారు. పదింటిలో ఎనిమిది ఫ్లైఓవర్లు 14 కి.మీ., రెండు ఫ్లైఓవర్లు నాలుగు కిలోమీటర్లు...మొత్తం 18 కి.మీ. పొడవునా నిర్మించాలని ప్రతిపాదించామన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టు, ఫ్లైఓవర్లు ఒకేసారి నిర్మాణం చేపట్టాలన్న దానిపై

... మిగతా 6వ పేజీలో

వీధి దీపాల సమస్యపై సీపీ దృష్టి

అన్నీ వెలిగేలా చూడాలని జీవీఎంసీ కమిషనర్‌కు సూచన

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడం వల్ల చోరీలు పెరుగుతున్నాయని పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి భావిస్తున్నారు. ఈ మేరకు వీధి దీపాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను కోరారు. నగరంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. దీనిని కొంతమంది నేరస్థులు, ఆకతాయిలు అవకాశంగా తీసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీ శంఖబ్రతబాగ్చి రెండు రోజుల క్రితం జీవీఎంసీ కమిషనర్‌ను కలిశారు. నగరంలో ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలగడం లేదో, ఎక్కడ కొత్తగా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందో వివరించారు. సీపీ విజ్ఞప్తిపై జీవీఎంసీ కమిషనర్ సానుకూలంగానే స్పందించినట్టు అధికారులు చెబుతున్నారు.

ఇష్టానుసారం 'ప్రసాద్' పనులు

» మాస్టర్ ప్లాన్ విస్మరించి నిర్మాణాలు
» అధికారుల తీరుపై విమర్శలు

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులు ప్రసాద్ పథకం కింద చేపడుతున్న పనుల్లో అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. రూ. 54.4 కోట్లతో పర్యాటక శాఖ చేపడుతున్న ఈ పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతున్నాయని దేవదాయ శాఖ కమిషనర్, పాలక మండలి పదే పదే చెబుతున్నా.. అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రసాద్ పథకం కింద తాజాగా సింహగిరి బస్టాండ్‌లో నిర్మిస్తున్న సమాచార కేంద్రం మాస్టర్ ప్లాన్‌లో లేదని,


నిర్మాణంలో ఉన్న సమాచార కేంద్ర భవనం

అలాగే అన్నప్రసాద పథకానికి చేరువగా నిర్మించాల్సిన యాత్రికుల వసతి కేంద్రాన్ని అక్కడి నుంచి టీవీ రిలే స్టేషన్ సమీపానికి మార్చడం కూడా మాస్టర్ ప్లాన్‌లో లేదని పలువురు పేర్కొంటున్నారు. సమాచార కేంద్రం నిర్మాణాన్ని దేవదాయ శాఖ రాష్ట్ర అడిషినల్ కమిషనర్ ఇటీవల పరిశీలించి తక్షణమే పనులను నిలిపివేయాలని ఆదేశించారు. ఆ నిర్మాణం మాస్టర్ ప్లాన్‌లో లేకపోవడంతో పాటు దానివల్ల వార్షిక ఉత్సవాలైన చందనోత్సవం, గిరి ప్రదక్షిణంతో పాటు శని, ఆదివారాలు, ఇతర ప్రభుత్వ సెలవు రోజుల్లో భక్తుల వాహనాల రాకపోకలకు, పార్కింగ్‌కు ఇబ్బంది కలుగుతుందని అడిషినల్ కమిషనర్ అభిప్రాయపడ్డారు. మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయాల్సి వస్తే దేవదాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ముందస్తు అనుమతులు పొందాల్సి ఉందన్న నిబంధనను కూడా అధికారులు పాటించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌టీసీ కార్తీకం ప్రత్యేక సర్వీసులు

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్తీకం పురస్కరించుకుని ఆర్‌టీసీ సింహాచలం డిపో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ఈమేరకు డిపో మేనేజర్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10, 17, 24వ తేదీల్లో సాయంత్రం 5 గంటలకు సింహాచలం కాంప్లెక్స్ నుంచి పంచారామాల దర్శనం కోసం ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ఈ ప్రత్యేక ప్యాకేజీ కింద అమరావతి (అమరేశ్వరస్వామి), భీమవరం (సోమేశ్వరస్వామి), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరస్వామి), ద్రాక్షారామం (భీమేశ్వరస్వామి), సామర్లకోట (కుమార రామ లింగేశ్వరస్వామి)ఆలయాలను దర్శించుకోవచ్చు. ఈ ప్యాకేజి బుకింగ్ ప్రయాణికులు సింహాచలం డిపోలో మాత్రమే చేసుకోవాలి, గ్రూపుగా బస్సు కోరుకునే వారికి కూడా సర్వీసులను పంపుతారు. గ్రూపులుగా బస్సులు కోరుకునే వారి సౌకర్యార్థం అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరకు, బొర్రా గుహలు, పాడేరు, లంబసింగి ప్రాంతాలకు సర్వీసులను ఏర్పాటు చేయనున్నారు. పంచారామాల దర్శనానికి వెళ్లే వారికి సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ చార్జీ రూ.1650, అల్ట్రా డీలక్స్ చార్జీ రూ. 2100లుగా నిర్ణయించారు. ప్రత్యేక బస్సులు కోరుకునే వారు ఇతర వివరాలకు అసిస్టెంట్ మేనేజర్‌ను 7997204938, మేనేజర్ 7382917295 ఫోన్ నంబర్లను సంప్రతించాలి.

గీతంలో విదేశీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు

సాగర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులు ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చుకోవాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్ అజిత సూచించారు. వర్సిటీలో నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విదేశీ విద్యార్థులకు విశాఖ సురక్షితమైనదని పేర్కొన్నారు. గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ అంకితభావం, కష్టపడే తత్వం ఉంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునన్నారు. గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేపీసీ కిషన్ మాట్లాడుతూ గీతంలో ప్రస్తుతం 40 దేశాలకు చెందిన 450 మందికి పైగా విదేశీ విద్యార్థులు చదువుతున్నారని,కొత్తగా 29 దేశాల నుంచి ప్రవేశం పొందారని వెల్లడించారు. అనంతరం విదేశీ విద్యార్థుల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.


స్వర్ణ పుష్పాల మధ్య స్వామివారు

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో గురువారం నుంచి ఆర్జిత సేవలను పునఃప్రారంభించారు. మనవాళ మహామునుల తిరు నక్షత్ర పూజలు పురస్కరించుకుని ఈనెల 2 నుంచి ఆర్జిత సేవలను రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరు నక్షత్ర పూజలు పూర్తి కావడంతో వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలతో స్వామి వారి సేవలను యథావిధిగా కొనసాగించారు. ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజలు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సంగివలసలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తగరపువలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు సంగివలసలో అపార్టుమెంట్లకు చెందిన మురుగు నీటి ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన వార్తకు జోనల్ కార్యాలయం ఇంజనీరింగ్ సిబ్బంది స్పందించారు. ఈమేరకు శిథిలమైన డ్రైనేజీ పైపులైన్‌ను గుర్తించి తాత్కాలింగా మరమ్మతులు చేపట్టారు. వాడుక నీరు, మురుగు నీరు కాలువల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తామని సహాయ ఇంజనీర్ సురేశ్ తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


డైనింగ్ హాలును ప్రారంభిస్తున్న ఎంపీడీఓ హనుమంతరావు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో దివీస్ కర్మాగారం చేపట్టిన పలు నిర్మాణాలను ఎంపీడీఓ హనుమంతరావు గురువారం ప్రారంభించారు. విద్యార్థులు నడవడానికి పాత్ వే, భోజనాలకు డైనింగ్ హాల్‌ను దివీస్ కర్మాగారం నిర్మించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ దివీస్ కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివరాణి, దివీస్ సీఎస్ఆర్ మేనేజరు డి. సురేశ్ కుమార్, శ్రీనివాస్, నరసింహ, కనకరాజు, పాఠశాల ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేశ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దిపాలెం, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులువాడ, బిపికళ్లాలు, దుక్కవానిపాలెం, ఆనందపురం, వేములవలస, పాలవలస, బాకురుపాలెం, తర్లువాడ, ఎల్‌వీ పాలెం, గుడిలోవ, బోని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

భీమిలిలో...

భీమునిపట్నం : భీమిలిలో 11 కేవీ టౌన్ ఫీడర్, 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంక్ కాలనీ, తాతాజీ నగర్, ఎల్లమ్మపేట, మహాలక్ష్మీపురం, డెక్కతిపాలెం,రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు, స్మిత్ వీధి, జగనన్న కాలనీ, నేరెళ్లవలస కాలనీ,ఎస్‌వోఎస్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

ఘనంగా స్కౌట్స్ ఆవిర్భావ దినోత్సవం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు ఉన్నత పాఠశాలలలో స్కౌట్స్ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్కౌట్స్ వ్యవస్థాపకుడు బేడన్ పౌల్ చిత్రపటానికి పూలమాల వేసి, జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మురళీధర్ మాట్లాడుతూ 1907లో ఇంగ్లాండ్‌లో ప్రారంభించిన స్కౌట్స్ సంస్థను 1909లో భారత్ లో ప్రవేశపెట్టారని తెలిపారు. 1950 నవంబరు 7న స్కౌట్స్, గైడ్స్ రెండింటిని కలిపి ఒకే సంస్థగా ఏర్పాటు చేశారన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన జిల్లా స్కౌట్స్ కమిషనర్ ప్రసాదరావు సంస్థలో ఉన్న వివిధ విభాగాల గురించి వివరించారు.


ఆర్‌డీఓను సన్మానిస్తున్న సభ్యులు

రెవెన్యూ ఫిర్యాదులపై సమీక్ష

భీమునిపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో పలు కేసులపై విజినెస్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులు డివిజన్ పరిధిలో వున్న అట్రాసిటీ పెండింగ్ కేసులు, రెవెన్యూ ఫిర్యాదులపై సమీక్షించారు. ఈ సమావేశంలో కార్యాలయం ఏవో మనోరంజిని, తహసీల్దార్లు, ఏసీపీ, కమిటీ సభ్యులు బోనెల ఏసేపు, జలగడుగుల శ్రీనివాస్, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు మంచి నడవడిక ఉండాలి : సీపీ


సీపీ శంఖబ్రతబాగ్చీని సన్మానిస్తున్న అధ్యాపకులు

సాగర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడిక అలవర్చుకోవాలని సీపీ శంఖబ్రతబాగ్చీ సూచించారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో చదివినప్పుడు ఉన్నతమైన అవకాశాలు దక్కుతాయన్నారు. విద్యా దశలోనే సామాజిక సేవను అలవరచుకోవాలని చెప్పారు. అనంతరం కళాశాల అధ్యాపకులు సీపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఈమండి శంకరరావు, గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి. దక్షిణామూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బోస్, మోహిని, తదితరులు పాల్గొన్నారు.

'నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధమవ్వండి'

పద్మనాభం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నీటి సంఘాలతో పాటు సహకార సంఘాల ఎన్నికలు కూడా త్వరలో జరిగే అవకాశం ఉందన్నారు. రెండు ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. అలాగే పార్టీ సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని కోరారు.

మంగమారిపేటలో నేత్ర వైద్య శిబిరం



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

భీమునిపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్ మంగమారిపేట వారిజ నేత్ర విద్యాలయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విద్యాలయం విద్యార్థులందరికీ వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, భీమిలి కోర్టు జడ్జి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, నేత్ర వైద్యురాలు ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీలోని శ్రమజీవుల కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి నిధులు రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు లొడగల వెంకటరావు, కూటమి నాయకులు బమ్మిడి తారక్, రౌతు వెంకట్రావు, కంచిబోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వీఓఏల ఆందోళన



వెలుగు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న వీఓఏలు

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓ ఏలు వెలుగు కార్యాలయం ముందు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పారుపిల్ల అపర్ణ మాట్లాడుతూ ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకముందు వెలుగు కార్యాలయం నుంచి ఆనందపురం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు చందక రమణమ్మ, గుడివాడ రమణమ్మ, తమరాడ రమాదేవి, మామిడి దేవి, తదితరులు పాల్గొన్నారు.

గోడను ఢీకొన్న వ్యాన్

పదనాభం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్ది జంక్షన్ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద గురువారం తెల్లవారుజామున ఇటుకల లోడు వ్యాన్ అదుపు తప్పి గోడను ఢీకొట్టింది. దీంతో వ్యాన్ లోపల ఉన్న కూలీ కాళ్ల బంగారునాయుడు (40)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో డెంకాడ లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం

పద్మనాభం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కొల్లి మురళీకి గుండె ఆపరేషన్ నిమిత్తం అదే గ్రామానికి చెందని శ్రీనివాసా సేవా సంఘం సభ్యులు గురువారం రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు కోన సన్యాసిరావు, సభ్యులు మెహర్, ఎం. చిరంజీవి, సారిక శంకరరావు, అప్పలరాజు. ఎల్లయ్య, కె. సత్యనారాయణ పాల్గొన్నారు.

జోన్-2 ఏసీపీగా తిరుపతిరావు బాధ్యతల స్వీకరణ

కొమ్మాది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2 ఏసీపీగా ఎం. తిరుపతిరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఏసీపీ షబ్నమ్ శాస్త్రికి జ్ఞానాపురం జోన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జోన్-1 ఏసీపీగా పని చేస్తున్న తిరుపతిరావు నియమితులయ్యారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి


రామన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సాగర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో ప్రముఖ శాస్త్రవేత్త సర్. సీవీ రామన్ 136వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో ఉన్న రామన్ విగ్రహం వద్ద సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ పుష్పగుచ్ఛాలు ఉంచి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, మూర్తి ప్రయోగశాలల విశిష్ట ప్రొఫెసర్ టాటా పాల్గొన్నారు.

అర్చకులకు పారితోషికం ప్రకటన పట్ల హర్షం

భీమునిపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అర్చకులకు కనీస పారితోషికం రూ.15 వేలుగా ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఉత్తరాంధ్ర జిల్లాల అర్చక సమాఖ్య అధ్యక్షుడు రొంపిచెర్ల సింగరాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఒకేసారి ఫ్లైఓవర్లు, మెట్రో

... 5వ పేజీ తరువాయి

చర్చ సాగిందన్నారు. తొలిదశలో విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి కొమ్మాది వరకు మెట్రో నిర్మించాలని ప్రతిపాదించామన్నారు. ఫ్లైవోవర్లు, మెట్రో కలిపి చేపట్టనున్న ప్రాజెక్టుకు కిలోమీటరుకు రూ.150 నుంచి రూ.200 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టులో భూమి నుంచి ఎనిమిది మీటర్ల ఎత్తులో ఫ్లైవోవర్లు, దానిపై మరో ఎనిమిది మీటర్ల ఎత్తులో మెట్రో ప్రాజెక్టు వస్తాయన్నారు. రెండూ కలిపి ఒకే ఫ్రేమ్‌లో రావాలంటే తగిన స్థలం ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారని, ఈ నేపథ్యంలో సాంకేతికంగా ఏది ఉపయోగకరంగా ఉంటుందనేది వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. బెంగళూరు, జైపూర్‌లో ఫ్లైఓవర్లు/మెట్రో కలిపి నిర్వహిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏ రెండేళ్ల క్రితం రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో కొన్నిచోట్ల మార్పులు, చేర్పులు చేయాలన్న సూచనల మేరకు ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నదని అన్నారు. జీవీఎంసీ పరిధిలో తాగునీరు, పారిశుధ్యం, ఘన, జల వ్యర్థాల నిర్వహణ, ఇంజనీరింగ్ పనులు నాణ్యత తదితర అంశాలపై సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. టీడీఆర్ బాండ్ల జారీ అంశం చర్చకు వచ్చిందన్నారు. నగరంలో 100 గజాలలోపు స్థలాలను ఆక్రమణదారులకు ఆరేళ్ల క్రితం జారీచేసిన జీవో 296 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌ల జారీకి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కారంలో భాగంగా సింహాచలం దేవస్థానానికి ఇవ్వడానికి గాజువాక, ములగాడ మండలాల్లో భూములను గుర్తించామన్నారు. అదేవిధంగా నగరానికి వచ్చే పర్యాటకులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని సీఎం ఆదేశించారన్నారు. కైలాసగిరి, రుషికొండ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, నగరాన్ని సందర్శించే పర్యాటకులు ఐదారు రోజులు ఇక్కడే ఉండేలా సదుపాయాలు పెంచుతామన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అల్లిపురం వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో నివాసితుల సమస్యలు, అంగడిదిబ్బ నివాసితులకు మరోచోట భూమి కేటాయింపు, ఇసుకకొండ సత్యనారాయణ స్వామి గుడికి వెళ్లే భక్తులకు వసతులు వంటి వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

భూముల రీ సర్వేకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేశారు. ఆ రాళ్లపై అప్పటి సీఎం జగన్ బొమ్మ ముద్రించారు. వీటిలో 82,327 రాళ్లు పాతడం పూర్తిచేయగా, ఇంకా 7,209 రాళ్లు మిగిలి ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో సర్వే రాళ్లపై వేసిన జగన్ బొమ్మలు తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నది. అంటే భూమిలో పాతిన ప్రతి రాయిని బయటకు తీసి దానిపై ఉన్న జగన్ బొమ్మ తొలగించి మళ్లీ పాతాల్సి ఉంటుంది.

డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి సర్పంచుల సమస్యలు


పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న లక్ష్మీ ముత్యాలరావు

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి సర్పంచుల సమస్యలను తీసుకువెళ్లినట్టు ఆ సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు తెలిపారు. గురువారం ఆమె అమరావతిలో పవన్ కల్యాణ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతిలో తమ సంఘం భవన నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించాలని కోరారు.అలాగే ఇతర సమస్యలను విన్నవించారు. అనంతరం పవన్ కల్యాణ్‌ను సన్మానించారు.

'కౌశల్' పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రేమ్ కుమార్

తగరపువలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ సంయుక్తంగా ఏటా నిర్వహిస్తున్న కౌశల్ 2024 పోటీల పోస్టర్‌ను డీఈఓ పి. ప్రేమ్‌కుమార్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పక్కి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. విజేతలకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను, నగదు అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 15వ తేదీలోగా ఆయా పాఠశాలల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌశల్ రాష్ట్ర బాధ్యులు ఎంపీ శ్రీనివాస్ ఎ. రామలక్ష్మి, ఎంఎం విశ్వనాథం పాల్గొన్నారు.

రుషికొండ బీచ్ రహదారికి మోక్షం

... 5వ పేజీ తరువాయి

ఆలోచిస్తోంది. దీనిని చూడడానికి ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు వచ్చినప్పుడు స్థానిక కాలనీల పెద్దలు ఆయన్ను కలిసి బీచ్‌లోకి వెళ్లేందుకు దక్షిణ మార్గాన్ని తిరిగి తెరిపించాలని కోరారు. దీనిపై వారు అంతకుముందే ఎంపీ శ్రీభరత్‌ను, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిసి ఎలాగైనా రాకపోకలు జరిగేలా చూడాలని కోరారు. దాంతో వారిద్దరూ ఆ మార్గం అవసరాన్ని సీఎంకు వివరించడంతో తప్పకుండా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలతో మాట్లాడారు. రుషికొండ భవనం విలువైనది కాబట్టి, అక్కడకు ఎవరు పడితే వారు వెళ్లకుండా చూడాలని, ఆ విధంగా చర్యలు చేపట్టాక దక్షిణ మార్గం తెరిచి రాకపోకలకు అనుమతించాలని సూచించారు. ఈ సూచన ప్రకారం అధికారులు రుషికొండ భవనం మార్గంలో బారికేడ్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ పనులు పూర్తికాగానే అక్కడ ప్రత్యేకంగా సెక్యూరిటీని పెట్టి, దక్షిణ మార్గంలో గల రహదారిపై ప్రజల రాకపోకలకు అనుమతించనున్నారు. దీనివల్ల రుషికొండ బీచ్‌లోకి వెళ్లేందుకు రెండు మార్గాలు అందుబాటులో ఉంటాయి. రుషికొండ పోలీస్ స్టేషన్ జంక్షన్‌లో రద్దీ తగ్గుతుంది.

టన్ను ఇసుక రూ.750

... 5వ పేజీ తరువాయి

అందుబాటులోకి రానున్నాయి. ఒకవేళ డీలర్ల ఎంపికలో జాప్యం జరిగితే 17 లేదా 18వ తేదీల నుంచి విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించినట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. కొత్తగా అందుబాటులోకి రానున్న డిపోలలో 10 టన్నుల వరకు ఇసుక అందించాలని కమిటీ తీర్మానించింది. అంతకంటే ఎక్కువ అవసరం ఉన్న బిల్డర్లు/కాంట్రాక్టర్లు శ్రీకాకుళం, రాజమండ్రిల్లో రీచ్‌ల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజమండ్రి రీచ్‌లో టన్ను ఇసుక రూ.80 నుంచి రూ.90కు ఇస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని రీచ్‌లలో టన్ను రూ.200కు అందిస్తున్నారు. రాజమండ్రిలో మాదిరిగా శ్రీకాకుళం జిల్లాలోని రీచ్‌లలో టన్ను రూ.100 కంటే తక్కువకు సరఫరా చేయాలని జిల్లా యంత్రాంగం కోరుతుంది. ఇదిలావుండగా జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు రోజుకు సగటున 500 టన్నుల ఇసుక అవసరం. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపారు. గురువారం లేదా శుక్రవారం నుంచి ఇళ్ల నిర్మాణాలకు ఇసుక రవాణా మొదలు పెట్టాలని నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు.

జీవీఎంసీ బడ్జెట్‌పై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

దానితోపాటు దేనికి ఎంత ఖర్చుపెడుతున్నామనే వివరాలను స్పష్టంగా బడ్జెట్ ముసాయిదాలో పేర్కొనాలని సూచించారు. గొప్పల కోసం భారీ బడ్జెట్‌ను పెట్టి ఆచరణలో విఫలమైతే విమర్శలు ఎదుర్కోనాల్సి ఉంటుందని కమిషనర్ అన్నట్టు తెలిసింది. అన్ని విభాగాల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత జనవరి నాటికి ముసాయిదాను తయారుచేసి, స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ ఆమోదం తర్వాత ప్రభుత్వానికి పంపించనున్నారు.

చికెన్ వ్యర్థాల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

యూనిట్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనికోసం రాజమండ్రిలో యూనిట్‌ను ఏర్పాటుచేసిన సంస్థే ముందుకురావడంతో కాపులుప్పాడలోని యార్డు వద్ద ఐదెకరాల స్థలం కేటాయించారు. ఆ సంస్థ నగరంలో ఉత్పత్తి అయిన చికెన్ వ్యర్థాలను శాస్త్రీయంగా పిల్లెట్లుగా మార్చి పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ఎరువుగా మార్చుతుంది. దీనికోసం ఆ సంస్థ జీవీఎంసీకి ఏటా రూ.1.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించడంతో ఆ దిశగా త్వరలోనే ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

'మహా' గోప్యత

... 5వ పేజీ తరువాయి

ఆదేశిస్తూ వాయిదా వేశారు. అదే అంశానికి సంబంధించి జోన్-6లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఖర్చు చేసిన రూ.1.04 లక్షలు మొత్తాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించే అంశాన్ని ఈసారి ఎజెండాలో చేర్చడం చర్చనీయాంశంగా మారింది. వివిధ జోన్లలో నిర్వహించిన వేలంలో దుకాణాలను దక్కించుకున్న వారికి వాటిని అప్పగించడం, ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము వసూలు, పార్కింగ్ ఫీజు వసూలు, పార్కు లోపల క్యాంటీన్ అప్పగింత వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు. ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఒకరోజు ముందువరకూ బయటకు చెప్పకుండా గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా సభ్యులతోపాటు మీడియాకు మూడు రోజులు ముందుగానే సమాచారం ఇవ్వడంతోపాటు ఎజెండా కాపీ అందజేస్తారు. కానీ తాజా సమావేశానికి సంబంధించిన సమాచారంతోపాటు ఎజెండాను గురువారం మధ్యాహ్నం వరకూ బయటపెట్టకపోవడంపై అనేక రకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

స్టాండింగ్ కమిటీ సమావేశం ఎజెండాను ముందుగానే మీడియాకు అందజేయడం వల్ల వాటిపై లోతుగా విశ్లేషణలతో కథనాలు రాస్తున్నారని, దీనివల్ల కొన్ని అంశాలపై తమ వ్యక్తిగత ఆలోచన మేరకు నిర్ణయం తీసుకోవడానికి వీలుండడం లేదని కొంతమంది సభ్యులు చెప్పడం వల్లే అధికారులు చివరి నిమిషం వరకూ ఎజెండాను బయటపెట్టలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సభ్యులు వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమన్న ధోరణిలో ఆలోచిస్తూ స్టాండింగ్ కమిటీ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని బయటకు చెప్పొద్దంటూ అధికారులను ఆదేశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

నిర్లక్ష్యపు నీడలో ముడసర్లోవ పార్కు

- ఆధునీకరణకు నోచుకోక కళావిహీనం
- నిర్వహణ లోపంతో అధ్వానంగా పరిసరాలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పెచ్చులూడిన ట్యాంక్‌బండ్ రోడ్డు

ఆరిలోవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం ముడసర్లోవ పార్కులకు శాపంగా పరిణమించింది. ఒకప్పుడు.. ప్రకృతి ఒడిలో రెండు కొండల మధ్య సోయగాలు ఒలకబోస్తూ ఎంత చూసినా తనివి తీరని అందాలతో ముడసర్లోవ పార్కు అలరించేది. పక్కనే రిజర్వాయర్ ఉండడం చల్లని గాలి, ఎటు చూసినా పచ్చదనంతో పార్కులో వాతావరణం ఆహ్లాదంగా కనిపించేది. నగరంలోని ఉన్న ప్రముఖ పర్యాటక స్థలంలో ఇదొకటిగా చెప్పుకోవడం మినహా ఆ స్థాయిలో సౌకర్యాలు మాత్రం లేకుండా పోయాయి.

సుమారు 130 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పార్కు నిర్వహణ లోపం కారణంగా రోజురోజుకూ ప్రాభవం కోల్పోతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా పార్కు పరిస్థితి మాత్రం మారడం లేదు. పార్కు సుందరీకరణ కోసం ఏ నాయకుడూ, ప్రజాప్రతినిధి చిత్తశుద్ధితో కృషి చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒకప్పుడు సినిమా షూటింగ్‌లు, అవుట్‌డోర్ చిత్రీకరణలు ఇక్కడ నిత్యం చేపట్టేవారు. ఆ వైభవం నేడు మచ్చుకైనా కనిపించడం లేదు. కేవలం పార్కు ఉన్నదంటే ఉందని అనే దుస్థితికి చేరింది.



ముడసర్లోవ పార్కు ప్రధాన ప్రవేశ మార్గం



అధ్వానంగా ఉన్న పార్కులోని రోడ్డు

ప్రస్తుతం ఇక్కడ పారిశుధ్య నిర్వహణ కొరవడడంతో పార్కు అధ్వానంగా తయారైంది. వాకింగ్ ట్రాక్ రోడ్డు పెచ్చులూడిపోయింది. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట సామగ్రి మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. నిర్వహణ లోపం కారణంగా చెట్లు, పచ్చదనం అంతకంతకూ కనుమరుగు అవుతోంది.సాయంత్రం వేళల్లో సరిగా లైట్లు వెలగకపోవడం, దోమలు అధికంగా ఉండడం ఇబ్బందిగా మారుతోంది. దీంతో పర్యాటకుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. ఫలితంగా ఒకప్పుడు ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులతో కళకళలాడిన ముడసర్లోవ పార్కులో అంత సందడి కనిపించడం లేదు. పరిశుభ్రత లేకపోవడంతో ట్యాంకుబండ్‌పై కూర్చోడానికి ఎవరూ ఇష్టపడడం లేదు.

నగరంలో ఓ ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేర్కొన్న ముడసర్లోవ పార్కు ఆధునీకరణపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా మిగిలిన క్రీడా పరికరాలు

☛ సంక్షిప్తంగా..

ప్రీ రిపబ్లిక్ డే శిక్షణకు ఏయూ విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో జరుగనున్న ప్రి రిపబ్లిక్ డే శిక్షణకు ఏయూ తరఫున విద్యార్థులు వెళనున్నారు. ఈ సందర్భంగా ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు 2024కు ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అభినందించారు. ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని కేసీబీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు జరుగుతోంది. ఏయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈపీడీసీఎల్ పరిధిలోని 33 కేవీ డెయిరీఫారం సీఎంఆర్ ఫీడర్‌లో మరమతులు చేపడుతుండడంతో పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈడెన్ గార్డెన్స్ నార్త్ స్టార్ అపార్టుమెంటు, సీఎంఆర్ ఫంక్షన్ హాల్, లాన్సమ్ ఇసుకతోట ప్రాంతం, పాత వెంకోజీపాలెం, జేఆర్‌నగర్‌ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఏయూ ఉద్యోగికి 'మానవతా' ఆర్థిక సహాయం



చెక్ అందజేస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో చిరుద్యోగిగా పనిచేస్తున్న పి.లక్ష్మి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయం మానవతా స్వచ్ఛంద సంస్థ దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు చేతులమీదుగా ఉద్యోగిని లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ వి.కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు కె.సీతామాణిక్యం, అధ్యక్షుడు డాక్టర్ టి.శారోన్ రాజు, ఉపాధ్యక్షుడు పి.జానకిరామ్, కార్యదర్శి పి.త్రినాథరావు, కోశాధికారి డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, కన్వీనర్ డి.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని(గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు సోలాపూర్ 54, ఉల్లిపాయలు కర్నూల్ 40, టమాటా 34, వంకాయలు(తెలుపు) 42, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 40, పచ్చిబజ్జీ మిరపకాయలు 72,కాకరకాయలు 38, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 34, క్యారెట్ 54, దొండకాయలు 28, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (మీడియం) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 72,దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు విశాఖ క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు



ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ సహకారంతో ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో శిక్షణ పొందిన విశాఖపట్నం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ కాంపిటీషన్ 2024 పేరిట నరసారావుపేటలో నిర్వహించిన పోటీల్లో ఎస్.జిషితేష్ నాయుడు 100, 200 మీటర్లలో స్వర్ణం, 200 బటర్ ఫ్లైలో స్వర్ణ పతకాలను సాధించాడు. అలాగే ఎ.హిమశ్రీ 50 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో స్వర్ణ పతకాలు, 400 మీటర్లలో రజతాన్ని సాధించింది. జి.సాయిసిద్ధార్థ్ 50 మీటర్ల బటర్ ఫ్లైలో వెండి పతకాన్ని సాధించాడు. వీరితో పాటు ఎస్ స్టార్ కిరణ్స్ ఆకాడెమీ సహకారంతో బ్యాడ్మింటన్‌లో పార్థివ్, మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్ 19 నేషనల్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికైనట్టు స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకులు సహానీ ఒక ప్రకటనలో తెలిపారు.

సర్ సీవీ రామన్‌ను ఘన నివాళి



సర్ సీవీ రామన్‌కు అంజలి ఘటిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శాస్త్రవేత్త, నోబుల్ గ్రహీత సర్ సీవీ రామన్ 136వ జయంతి వేడుకలను ఏయూ భౌతిక శాస్త్ర విభాగంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఏయూలో ఫిజిక్స్ విభాగం స్థాపించడంలో సర్ సీవీ రామన్ పాత్రను, అలాగే విభాగం ఫిజిక్స్ రీసెర్చ్‌కు ఒక ప్రధాన జాతీయ కేంద్రంగా మార్చడంలో ఆయన అందించిన సహకారాన్ని విభాగం అధ్యాపకులు గుర్తు చేసుకున్నారు. అంతకుముందు సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు, మాజీ రెక్టార్ కె.సుమత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు విక్రయించిన ఐదుగురి అరెస్టు

ఎండాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాలలో పార్ట్‌టైమ్ జాబ్స్ పేరిట లింక్‌లు పంపించి, జనాన్ని మాయచేసి టాస్కుల పేరుతో డబ్బులు గుంజిన వ్యవహారంలో ఐదుగురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ నగరానికి చెందిన ఓ వ్యక్తి ఫేస్‌బుక్ చూస్తుండగా ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్‌జాబ్స్ యాడ్ వచ్చింది. దాని లింక్ క్లిక్ చేసి, మొబైల్ నంబరుతో కనెక్టయ్యాడు.అనంతరం అతడి వివరాలను సేకరించిన ముఠా, మూడు లింక్‌లు పంపించి, అందులోని వీడియోలకు లైక్‌లు కొట్టాల్సిందిగా కోరింది. ఆ తర్వాత వాటికి సంబంధించిన స్క్రీన్‌షాట్స్‌పంపమన్నారు. అనంతరం టెలిగ్రామ్‌యాప్‌లోని ఒకగ్రూపులో అతడి నంబర్‌ను యాడ్ చేసి టాస్కులు పూర్తిచేస్తే బాగా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపించారు. ఇలా ఇన్వెస్ట్‌మెంట్ పేరిట పలు దఫాలుగా రూ.2,00,160కట్టించుకుని మోసంచేశారు. ఇలాగే మరికొంతమంది నుంచి నిందితులు మొత్తం రూ.38,43,455 కొట్టేశారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇందులో విజయవాడకు చెందిన ఐదుగురిని నిందితులుగా గుర్తించారు. వారంతా స్విగ్గీలో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. సైబర్‌క్రైమ్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలు అమ్ముకున్నట్టు వారు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి, విశాఖ తీసుకువచ్చిన పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరగాళ్లకు విక్రయించిన బ్యాంకు ఖాతాలను పరిశీలించగా వాటిపై ఏపీ, తెలంగాణతో పాటు 14 రాష్ట్రాల్లో 93 కేసులు నమోదైనట్టు గుర్తించారు.

కౌన్సిల్‌లో సభ్యులు లేవనెత్తిన అంశాలకు పరిష్కారం చూపాలి

అధికారులకు మేయర్ హరి వెంకటకుమారి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి, పక్కన కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో సెప్టెంబరు 24 నుంచి 26 వరకు నిర్వహించిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు, అభ్యంతరాలకు పరిష్కార మార్గం చేపట్టాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో గత సర్వసభ్య సమావేశంపై సభ్యుల అడిగిన సమస్యల పరిష్కార చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలు, సమస్యలు తదితర వాటిపై జీవీఎంసీ తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ప్రజా సమస్యలు, ప్రజలకు కల్పించాల్సిన సదుపాయాలు, సంక్షేమ పథకాలు, నగరాభివృద్ధి కోసం సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరుతున్నందున ఆయా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉందని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. దీనికి ముందు జీరో అవర్ సమస్యలపై చేపట్టిన పరిష్కార చర్యలపై మరో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మేయర్ వివరించారు.

అనంతరం కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు సమాధానం లేదా పరిష్కార మార్గం అధికారులు సిద్ధం చేసి ఉన్నారని, సభ్యులు సూచించిన సమస్యలు, అభ్యంతరాలను తప్పనిసరిగా పరిష్కరించి వారికి సంబంధిత సమాధానాలు తమ ద్వారా వచ్చే సమావేశంలో పూర్తి వివరాలతో తెలియజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్

- గ్యాస్ బుకింగ్స్‌పై ఆందోళన వద్దు
- ఉచితంగానే ఈకేవైసీ సేవలు
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ దీపం-2 కింద ఉచిత గ్యాస్ సబ్సిడీ అందుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపం-2 గ్యాస్ సబ్సిడీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈకేవైసీ చేయడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద అర్హులను గుర్తించడానికి బియ్యంకార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, గ్యాస్ కనెక్షన్‌తో బ్యాంకు ఖాతా నంబరు ఉండాలన్నారు. పథకం అమలుకు డీలర్లు, డెలివరీ బాయ్స్ వద్ద ఈకేవైసీ చేసుకోవచ్చునన్నారు. ఈకేవైసీ అంటే బియ్యం కార్డు, ఆధార్‌కార్డుతో గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానం చేయడమేనని జేసీ వివరించారు. ఇది ఉచితంగా చేస్తారన్నారు. పథకంలో ప్రయోజనం పొందే లబ్ధిదారులు తొలుత ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసుకోవచ్చునని, నిర్ణీత గ్యాస్ ధరను ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. సిలిండరు బుక్ చేసుకున్న తరువాతే సబ్సిడీకి అర్హులన్నారు. సిలెండరు వచ్చిన 48 గంటల తరువాత లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు సొమ్ము జమచేస్తారన్నారు. పథకం అమలు తరువాత మొదటి గ్యాస్ సిలిండరు వచ్చే ఏడాది మార్చి 31 లోగా వస్తుందన్నారు. సుమారు ఐదునెలల సమయం ఉన్నందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ఇబ్బందులుంటే 1967కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. గ్యాస్ డెలివరీ సమయంలో అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 93,784 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా, 54,011 మందికి డెలివరీ చేశారన్నారు. అర్హులైన 37,385 మంది ఖాతాలకు రూ.3 కోట్లు సొమ్ము జమ చేశామని జేసీ తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి భాస్కరరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- పలువురికి జరిమానాలు



హెల్మెట్ ధరించని వాహనాలను నిలుపుతున్న పోలీసులు

మద్దిలపాలెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్లు ధరించని వాహనచోదకులపై మద్దిలపాలెం జాతీయరహదారి కూడలి వద్ద గురువారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను నిలిపి పత్రాలను పరిశీలించారు. చలానాలు నమోదు చేసి, వారి డ్రైవింగ్ లైసెన్సులు సస్పెండ్ చేశారు. కాగా, మద్దిలపాలెం కూడలి వద్ద పోలీసులు పట్టుకున్న వారిలో మహిళలు, యువకులు అధికంగా ఉండడం గమనార్హం. మరి కొందరు హెల్మెట్‌లు లేకపోవడమే కాకుండా ట్రిబుల్ రైడింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ కనకరాజు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. మద్దిలపాలెం కూడలిలో నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ప్రయాణికులు నిబంధనలు పాటించి ఫైన్‌ల నుంచి దూరంగా ఉండాలని సూచించారు.

ఆనంద్ మృతిపై అనుమానాలు

- ఉజ్బెకిస్తాన్‌లో కంపెనీ యాజమాన్యమే హతమార్చిందని మృతుని సోదరుడి ఆరోపణ



న్యూపోర్టు పోలీస్ స్టేషన్ వద్ద రోధిస్తున్న మృతుని భార్య, కుటుంబ సభ్యులు

గాజువాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉజ్బెకిస్తాన్‌లో మృతి చెందిన కొప్పనాతి ఆనంద్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి సోదరుడు సతీశ్ ఆరోపించారు. రెండు నెలల క్రితమే ఉపాధి నిమిత్తం ఉజ్బెకిస్తాన్ వెళ్లిన తన సోదరుడు ఎప్పటికప్పుడు ఫోన్ చేసి అక్కడ తాను పడుతున్న ఇబ్బందులను చెబుతూ బాధపడేవాడని తెలిపారు. తనను తిరిగి ఇండియాకు పంపేయాలని ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పేవాడని ఆయనన్నారు. ఆటోనగర్‌లోని ఏజెంట్ వద్ద ఆనంద్ పడుతున్న ఇబ్బందులను వివరించినా ఆయన స్పందించలేదని సతీశ్ వాపోయారు. ఉజ్బెకిస్తాన్‌లో తాను పడుతున్న ఇక్కట్లను వివరిస్తూ ఆనంద్ పంపిన వీడియో, ఆడియోలను చూసి తాము ఆందోళనకు గురయ్యామన్నారు.ఆ వీడియో, ఆడియోలను ఆనంద్ తన గ్రూప్ సభ్యులకు వాట్సాప్‌లో షేర్ చేయడం సంబంధిత కంపెనీ యాజమాన్యానికి తెలియడంవల్లే తన సోదరుడిని హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నామని సతీష్ ఆరోపించారు.

స్పందించని ఏజెంట్, పోలీసులు..

ఆనంద్ మృతి చెందిన విషయం తమకు ఉజ్బెకిస్తాన్‌లో పని చేస్తున్న కొంతమంది వ్యక్తుల ద్వారా తెలిసిందని సతీశ్ తెలిపారు. తన సోదరుడు ఎలా మృతి చెందాడన్న విషయంపై ఆనంద్‌ను ఉపాధి కోసం పంపిన ఏజెంట్‌ను అడిగే ప్రయత్నం చేసినా స్పందించలేదన్నారు. తనకు ఈ విషయంతో సంబంధం లేదని ఏజెంట్ చెప్పాడని ఆరోపించారు. ఉజ్బెకిస్తాన్‌లో తన సోదరుడు ఎలా మృతి చెందాడో ఏజెంటును పిలిచి తెలుసుకోవాలని న్యూపోర్టు పోలీసులను కోరినా ఫలితం లేకుండా పోయిందని సతీశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద కుటుంబ సభ్యుల నిరసన

కాగా ఆనంద్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ గురువారం రాత్రి న్యూపోర్టు పోలీస్ స్టేషన్ బయట బైఠాయించి నిరసన తెలిపారు. మృతుని భార్య, తల్లితో పాటు కుటుంబ సభ్యులు, యాతపాలెం గ్రామస్తులు నిరసన చేపట్టారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు స్టేషన్ వద్ద నుంచి కదిలేది లేదని వారు స్పష్టం చేశారు.

మిజోరం మంచిని తెలియజేయండి

- ఏపీ నుంచి వెళ్లిన విశ్వ హిందీ పరిషత్ బృందానికి ఆ రాష్ట్ర గవర్నర్ హరిబాబు సూచన



గవర్నర్ దంపతులకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న బృందం సభ్యులు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మిజోరం ప్రజల మంచిని, ఇక్కడ అందాలను అందరికీ తెలియజేయాలని ఆ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నేతృత్వంలో 16 మంది పర్యాటక బృందం మిజోరంలో ఐదు రోజుల పర్యటనకు వెళ్లారు. ఈ బృందానికి గవర్నర్ హరిబాబు ఆ రాష్ట్ర రాజభవన్ బాంక్వెట్ హాలులో ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మిజోరం ఎంతో ప్రశాంత రాష్ట్రమన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇక్కడ సేల్స్‌మెన్ లేకుండా దుకాణాలు ఉంటాయని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు లేకుండా ప్రజలే స్వీయ నియంత్రణ పాటిస్తారని, ఎన్నికలలో బ్యానర్లు, లౌడ్ స్పీకర్లు, సభలు ఉండవని, ఎవరంతటవారే తమ ఓట్లు ప్రశాంతంగా వేస్తారని తెలిపారు. ఇలాంటి విషయాలు మన ప్రాంతాల్లో చాలా మందికి తెలియవని, అందుకు మిజోర రాష్ట్ర మంచితనంతో పాటు ప్రకృతి రమణీయత గురించి వివరించాలని పర్యటనకు వెళ్లిన బృందానికి హరిబాబు సూచించారు. ఈ బృందానికి వసతి, భోజన ఏర్పాట్లను గవర్నర్ సతీమణి జయశ్రీ వ్యక్తిగతంగా పర్యవేక్షించారు.

అకాడమీ స్థలాన్ని కళాశాలకు కేటాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఒమ్మి సన్యాసిరావు తదితరులు

ఆరిలోవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న మూడెకరాల భూమిని పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీకి కాకుండా జూనియర్ కళాశాల ఏర్పాటుకు కేటాయించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తోటగరువు ఎర్ని దుర్గమాంబ ఆలయం వద్ద ప్లకార్డుల తో నిరసన తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో పేదలు ఎక్కువమంది ఉన్నారని, వారికి అందుబాటులో జూనియర్ కళాశాల లేదన్నారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో సుమారు రెండువేల మంది విద్యార్థులు చదువుతున్నారని, వారంతా ఇంటర్ విద్యకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ స్థలం కళాశాలకు కేటాయించి, బ్యాడ్మింటన్ అకాడమీకి మరో ప్రాంతంలో స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘర్షణలో గాయపడిన యువకుడి మృతి

- హత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు



దుర్గారావు (ఫైల్ ఫొటో)

పెందుర్తి-రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట సమీపంలోని శానాతివానిపాలెం వద్ద ఈ నెల ఐదో తేదీ రాత్రి తొమ్మిది ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో తలకు తీవ్ర గాయ మై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొబ్బర దుర్గారావు (25) అనే యువకుడు గురువారం మృతి చెందా డు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కర్రి వెంకట జగదీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గారావు తల్లి సత్యవతితో కలిసి నివసిస్తున్నాడు. ఐదో తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన దుర్గారావు స్థానికులను, బంధువులను దూషించాడు. అప్పటికే అక్కడ క్రికెట్ ప్లేయర్ విరాట్ కోహ్లి జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న కొంతమంది యువకులు దుర్గారావును వారించడానికి యత్నించగా వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో దుర్గారావును సమీప బంధువు బొబ్బర నూకరాజు, మరికొంతమంది గట్టిగా మందలించడంతో ఘర్షణ మరింత పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో దుర్గారావు కింద పడిపోవడంతో తలకు దెబ్బతగిలి రక్తస్రావమవ్వడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు నూకరాజుతో పాటు ఆయన కుమారుడు, కుమార్తె, సోదరుడు, వారిద్దరి కుమారులను అదుపులోకి విచారిస్తున్నారు. ఇరు వర్గాల మధ్య ఉన్న పాత గొడవల వల్లే ఈ ఘర్షణ చోటుచేసుకున్నట్టు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. తలకు తీవ్ర గాయమై దుర్గారావు మృతి చెందినందున హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

డీఎస్సీలో వెయిటేజీ కల్పించాలని వినతి

కంచరపాలెం, నవంబరు 7 : కూటమి ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మెగా డీఎస్సీలో సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలని విశాఖ జిల్లా సీఆర్పీల సంఘం ప్రతినిధులు పి.గణపతిరావు, చైతన్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఈడీ కోర్సులు పూర్తి చేసి టెట్ పరీక్షలో సాధించిన సీఆర్పీలు సమగ్ర శిక్షలో కాంట్రాక్టు ఉద్యోగులుగా గత 12 ఏళ్లుగా కీలక విధులు చేపడుతున్నారన్నారు. వీరికి కనీసం ఏడాదికి ఒక్క మార్కు చొప్పున వెయిటేజీ ప్రకటించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు. డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటన కోసం ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రాలను అందజేసినట్టు తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే విద్యా సంబంధిత కార్యకలాపాలను క్షేత్ర స్థాయిలో అమల్లో సీఆర్పీలు కీలక భూమిక పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు వీరి సేవలను గుర్తించి కనీస న్యాయంగా డీఎస్సీలో వుయిటేజీ ప్రకటించాలని కోరారు.

నూతన క్రీడా పాలసీతో విప్లవాత్మక మార్పులు

ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతి



విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నూతన క్రీడా విధానంతో రాష్ట్ర క్రీడా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోవడం ఖాయమని నగరానికి చెందిన ఒలింపియన్, భారత అత్యంత వేగవంతమైన హడ్లర్ ఎర్రాజీ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. నూతన పాలసీలలో అంతర్జాతీయ ఈవెంట్లకు కల్పించిన ప్రాధాన్యం, అందించే ప్రోత్సాహకాలు వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. యువ క్రీడాకారులు తమ కలలను సాకారం చేసుకునేందుకు నూతన కొత్త విధానాలు క్రీడాకారులలో శక్తిని పెంచుతాయనడంలో సందేహం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల సామర్థ్యాన్ని విశ్వసించి భావి తరాలకు స్ఫూర్తినిచ్చే నూతన విధానాలను అమలు చేయడంలో పారదర్శకత పాటించాలని ఆమె కోరారు.

టీటీడీ బోర్డు సభ్యుడు ఆనందసాయికి సత్కారం



ఆనందసాయి దంపతులను సత్కరిస్తున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు, ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ బూరగాపు ఆనంద్‌సాయి, వాసుకి దంపతులను దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకుడు బోధిలపాటి ఉమామహేశ్వరరావు తిరుమలలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈమేరకు ఉమామహేశ్వర రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆనంద్‌సాయి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జనసేన నాయకుడు సునీల్ కూడా పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం కుటుంబ సమేతంగా తిరుమలలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పట్టువస్త్రంతో ఆయన్ను సత్కరించి,స్వామివారి ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమలలో లభిస్తున్న సేవల పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ఎండోక్రైనాలజిస్టుల జాతీయ సదస్సు ప్రారంభం

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీచ్ రోడ్డులో ఉన్న నోవాటెల్‌లో ఎండో క్రైనాలజిస్టు ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా 53వ జాతీయ సదస్సు గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ సదస్సును సీనియర్ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ దిలీప్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు ఈనెల 10వ తేదీ వరకు జరిగే ఈ సదస్సుల్లో వినాళ గ్రంథులు, షుగర్, థైరాయిడ్ సమస్య లపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యుడు డి. సుధాకర్ రావు, జయంతి, రమేష్, సుబ్రహ్మణ్యం, పద్మలత, మైథిలీ పాల్గొన్నారు.

సభ్యులు లేవనెత్తిన అంశాలకు పరిష్కారం చూపాలి

» అధికారులకు మేయర్ హరి వెంకటకుమారి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి, పక్కన కమిషనర్ సంపత్‌కుమార్

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో సెప్టెంబరు 24 నుంచి 26 వరకు నిర్వహించిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు, అభ్యంతరాలకు పరిష్కార మార్గం చేపట్టాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. గురువారంఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో గత సర్వసభ్య సమావేశంపై సభ్యుల అడిగిన సమస్యల పరిష్కార చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలు, సమస్యలు తదితర వాటిపై జీవీఎంసీ తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ప్రజా సమస్యలు, ప్రజలకు కల్పించాల్సిన సదుపాయాలు, సంక్షేమ పథకాలు, నగరాభివృద్ధి కోసం సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరుతున్నందునఆయా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉందని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. దీనికి ముందు జీరో అవర్ సమస్యలపై చేపట్టిన పరిష్కార చర్యలపై మరో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మేయర్ వివరించారు.

అనంతరం కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు సమాధానం లేదా పరిష్కార మార్గం అధికారులు సిద్ధం చేసి ఉన్నారని, సభ్యులు సూచించిన సమస్యలు, అభ్యంతరాలను తప్పనిసరిగా పరిష్కరించి వారికి సంబంధిత సమాధానాలు తమ ద్వారా వచ్చే సమావేశంలో పూర్తి వివరాలతో తెలియజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం తగదు

» రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీతమ్మధార, నవంబరు 7: (ఆంధ్రజ్యోతి) : సర్దుబాటు పేరిట పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం భరించాలని, విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్.రామారావు డిమాండ్ చేశారు. సీతమ్మధారలో ఈపీడీసీఎల్ కార్యాలయంలో వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రూ.18 వేల కోట్ల భారాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయాలన్న ప్రతిపాదన ఎంతమాత్రం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి అయిదు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికే అధిక ధరలు ఓ వైపు, ఆదాయాలు లేక మరోవైపు ప్రజలు సతమతమవుతుండగా, ఈ కరెంటు చార్జీల అదనపు భారం తట్టుకోలేని శక్తి వారికి లేదన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ మూల వెంకటరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరట భారం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని ు డిమాండ్ చేశారు. అనంతరం ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరావు, సూర్యనారాయణ, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

'కౌశల్' పోస్టర్ ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ప్రతిభా అన్వేషణలో భాగంగా ప్రతి సంవత్సరం భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌశల్- 2024 కార్యక్రమ పోస్టరును జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 8, 9, 10 తరగతులకు సంబంధించిన గణితం, విజ్ఞాన శాస్త్రం, సాంఘిక శాస్త్రంలోని అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు కౌశల్ ప్రతినిధులు తెలిపారు. పాఠశాలల్లో కో- ఆర్డినేటర్లు విద్యార్థుల పేర్లను నవంబరు 15 లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు ఎంపీ శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఎ.రామలక్ష్మి, ఎంఎస్వీ విశ్వనాథం పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

సీతమ్మధార, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం 14వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. నార్త్ నియోజకవర్గం సీనియర్ టీడీపీ నాయకురాలు, 14వ వార్డు టీడీపీ బూత్ ఇంచార్జ్ ముత్యాల హరిత ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు పి.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, బీసీ సెల్ అధ్యక్షుడు వై.కృష్ణ, సీనియర్ నాయకులు కె.ప్రసాద్, చిగురుపాటి కృష్ణ, వీరభద్రరావు, ఎ.రాజబాబు, రూప, లక్ష్మి, వరలక్ష్మి, పి.ఈశ్వరరావు, కె.సాగర్, జగన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట : టీడీపీకి కార్యకర్తలే బలం అని బీసీ సమైఖ్య సంఘం అధ్య క్షుడు, అఖిల గాండ్ల తెలుకుల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పెబ్బిలి రవికుమార్ అన్నారు. గురువారం ఆయన పలు వార్డుల్లో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. 600లకు పైగా సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడానికి కార్యకర్తలు చేసిన కృషే కారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి నేతలకు తినిపిస్తున్న వరప్రసాద్

మాధవధార, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గం 50వవార్డు మాధవధారలో గురువారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, డ్వాక్రా సంఘాల సభ్యుల సమక్షంలో వార్డు ప్రెసిడెంట్ ఎస్.వరప్రసాద్ బర్త్‌డే కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నరసింహ, వార్డు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ : జేసీ

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ దీపం-2 కింద ఉచిత గ్యాస్ సబ్సిడీ అందుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపం-2 గ్యాస్ సబ్సిడీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈకేవైసీ చేయడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద అర్హులను గుర్తించడానికి బియ్యంకార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, గ్యాస్ కనెక్షన్‌తో బ్యాంకు ఖాతా నంబరు ఉండాలన్నారు. పథకం అమలుకు డీలర్లు, డెలివరీ బాయ్స్ వద్ద ఈకేవైసీ చేసుకోవచ్చునన్నారు. ఈకేవైసీ అంటే బియ్యంకార్డు, ఆధార్‌కార్డుతో గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానం చేయడమేని జేసీ వివరించారు. ఇది ఉచితంగా చేస్తారన్నారు. పథకంలో ప్రయోజనం పొందే లబ్ధిదారులు తొలుత ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసుకోవచ్చునని, నిర్ణీత గ్యాస్ ధరను ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. సిలిండరు బుక్ చేసుకున్న తరువాతే సబ్సిడీకి అర్హులన్నారు. సిలెండరు వచ్చిన 48 గంటల తరువాత లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ చేస్తారన్నారు. పథకం అమలు తరువాత మొదటి గ్యాస్ సిలిండరు వచ్చే ఏడాది మార్చి 31 లోగా వస్తుందన్నారు. సుమారు ఐదునెలల సమయం ఉన్నందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ఇబ్బందులుంటే 1967కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 93,784 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా 54,011 మందికి డెలివరీ చేశారన్నారు. అర్హులైన 37,385 మంది ఖాతాలకు రూ.మూడు కోట్లు సొమ్ము జమ చేశామని జేసీ తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి వి.భాస్కరరావు పాల్గొన్నారు.

'పిల్లల దత్తత చట్ట ప్రకారం జరగాలి'

సీతంపేట, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్ర బాలల సంరక్షణ కార్యాలయంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ అధ్యక్షతన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి సమక్షంలో అనాథ బాలికలకు ఊయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జయదేవి మాట్లాడుతూ పిల్లలను దత్తత తీసుకునే వారు చట్టబద్ధంగా స్వీకరించాలన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

అల్లిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం వెంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవాసంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం గౌరీ పరమేశ్వరులను పసుపు కొమ్ములతో అలంకరించారు.

వారం రోజుల్లో నిరాశ్రయ వసతి గృహాల సమస్యలు పరిష్కారం

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



కమిషనర్ సంపత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నిరాశ్రయులు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఏయూటీడీ నిర్వహిస్తున్న నిరాశ్రయ వసతి గృహాలను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆయనకు పలు సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా రెండవ అంతస్తులో ఉన్న షెల్టర్లకు వచ్చే వాటర్ పైపులైన్ కిందనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుసంధానం చేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అలాగే శ్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయని వివరించారు. కమిషనర్ స్పందిస్తూ.. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రైల్వేస్టేషన్‌కు, బస్టాండుకు అందుబాటులో ఉండేలా ఏయూటీడీ నడుపుతున్న షెల్టర్లకు శాశ్వత భవనాలను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. భీమ్‌నగర్ షెల్టర్ రెసిడెంట్స్‌ను టీఎస్సార్ మొదటి అంతస్తు, రిపేర్లు చేసి తాత్కాలికంగా తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ 4 కమిషనర్ మల్లయ్యానాయుడు, యూసీడీ పీడీ ఫణిరామ్, వాటర్ వర్క్స్, పబ్లిక్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రుషికొండ బీచ్ రహదారికి మోక్షం

... 5వ పేజీ తరువాయి

ఆలోచిస్తోంది. దీనిని చూడడానికి ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు వచ్చినప్పుడు స్థానిక కాలనీల పెద్దలు ఆయన్ను కలిసి బీచ్‌లోకి వెళ్లేందుకు దక్షిణ మార్గాన్ని తిరిగి తెరిపించాలని కోరారు. దీనిపై వారు అంతకుముందే ఎంపీ శ్రీభరత్‌ను, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిసి ఎలాగైనా రాకపోకలు జరిగేలా చూడాలని కోరారు. దాంతో వారిద్దరూ ఆ మార్గం అవసరాన్ని సీఎంకు వివరించడంతో తప్పకుండా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలతో మాట్లాడారు. రుషికొండ భవనం విలువైనది కాబట్టి, అక్కడకు ఎవరు పడితే వారు వెళ్లకుండా చూడాలని, ఆ విధంగా చర్యలు చేపట్టాక దక్షిణ మార్గం తెరిచి రాకపోకలకు అనుమతించాలని సూచించారు. ఈ సూచన ప్రకారం అధికారులు రుషికొండ భవనం మార్గంలో బారికేడ్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ పనులు పూర్తికాగానే అక్కడ ప్రత్యేకంగా సెక్యూరిటీని పెట్టి, దక్షిణ మార్గంలో గల రహదారిపై ప్రజల రాకపోకలకు అనుమతించనున్నారు. దీనివల్ల రుషికొండ బీచ్‌లోకి వెళ్లేందుకు రెండు మార్గాలు అందుబాటులో ఉంటాయి. రుషికొండ పోలీస్ స్టేషన్ జంక్షన్‌లో రద్దీ తగ్గుతుంది.

10న భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెల్లయ్యమ్మతోట యాతపాలెంలోని భువనేశ్వరీ దేవి ఆరాధన పీఠంలో ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 10న శంఖం పుష్పపత్రితో ఆదివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు పీఠం నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో హెచ్‌పీసీఎల్ సౌజన్యంతో ఇగ్నైట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఐఏటీపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ వెల్డర్, పైప్ ఫిట్టర్, ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంటర్, ఐటీఐ విద్యార్హత కలిగిన వారు శిక్షణకు అర్హులు. ఆసక్తి గల వారు 79813 36432, 83746 60705 సెల్ నంబర్లను సంప్రతించాలని నిర్వాహకులు సూచించారు.

చికెన్ వ్యర్థాల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

యూనిట్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనికోసం రాజమండ్రిలో యూనిట్‌ను ఏర్పాటుచేసిన సంస్థే ముందుకురావడంతో కాపులుప్పాడలోని యార్డు వద్ద ఐదెకరాల స్థలం కేటాయించారు.ఆ సంస్థ నగరంలో ఉత్పత్తి అయిన చికెన్ వ్యర్థాలను శాస్త్రీయంగా పిల్లెట్లుగా మార్చి పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ఎరువుగా మార్చుతుంది. దీనికోసం ఆ సంస్థ జీవీఎంసీకి ఏటా రూ.1.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించడంతో ఆ దిశగా త్వరలోనే ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జస్వంత్‌సూర్యకు రాజ్య పురస్కారం ప్రదానం



గవర్నర్ చేతుల నజీవర్ నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తున్న జస్వంత్‌సూర్య

కంచరపాలెం, నవంబరు 7 : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఏపీ గవర్నర్, రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడు అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నగరానికి చెందిన డి.జస్వంత్‌సూర్య రాజ్య పురస్కారాన్ని అందుకున్నాడు. స్థానిక శ్రీవిద్యా ఇంగ్లీష్ మీడియం స్కూలులో చదువుతున్న డి.జస్వంత్ సూర్య విశాఖపట్నం జిల్లా తరపున ఈ పురస్కారానికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎల్.త్రిమూర్తిరావు మాట్లాడుతూ విశాఖ జిల్లా తరఫున తమ స్కూలు విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. గవర్నర్ చేతుల మీదుగా రాజ్య పురస్కార్ అవార్డును స్వీకరించడం గొప్ప విషయమని జస్వంత్‌సూర్యను స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్ ఎం.హరీష్‌కుమార్, ఉపాధ్యాయులు శంకర్‌రావు, చలపతిరావు, కె.సుజాత అభినందించారు.

సాగర తీరంలో ఘనంగా ఛట్ పూజలు



పూజల్లో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ కుటుంబసభ్యులు

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించే ఛట్ పూజలను గురువారం సాగరతీరంలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు.విశాఖ ఛట్ పూజా సమితి ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లో ఉత్తరాది వాసులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సూభాష్ చంద్రరాయ్ మాట్లాడుతూ ఉత్తరాదివాసులు అత్యంత భక్తితో నిర్వహించే పండుగ ఛట్ పూజ అని, సూర్యోదయ, సూర్యాస్తమయ సమయంలో పూజలు చేయడం పండగ సంప్రదాయమన్నారు.ఆరేళ్లుగా నగరంలో ఛట్‌పూజలు చేస్తున్నామన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే తీరానికి చేరుకున్న భక్తులు ఉదయించే సూర్యుడికి ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి సాయంత్రం సూర్యాస్తమయ సమయంలోనూ పూజలు చేశారు.పండగ సందర్భంగా పసుపు, అల్లం, బెల్లం, చెరకు, అరటిపళ్లు స్వామికి నివేదించి, ప్రసాదంగా స్వీకరించారు. వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.ఛట్ పూజా సమితి సభ్యులు ప్రకాష్ భర్తియా, ఆనంద్ పాఠక్ వికాశ్, నగరంలో స్థిరపడి ఉత్తరాది మహిళలు పూజలు చేశారు.

నర్సుల సేవలతోనే కేజీహెచ్‌కు గౌరవం

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నర్సుల సేవల వల్లే కేజీహెచ్‌కు గౌరవం పెరుగు తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ అన్నారు. గురువారం ఆంధ్రా వైద్య కళాశాల సమావేశ మందిరంలో ప్రభుత్వ నర్సుల సంఘం తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు టి. గంగా భవానీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శివానంద్ మాట్లాడుతూ నర్సుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, గత ఆరేళ్లలో గుర్తింపు నర్సింగ్ అసోసియేషన్ లేకపోవడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని చెప్పారు. జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ నర్సింగ్ సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని జేఏసీ ద్వారా ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.. ఈ సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, నర్సింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు బి. భాగ్య లక్ష్మి, అసోసియేషన్ నాయకులు వరలక్ష్మి, రవిశంకర్, నారాయణరావు, రాజశేఖర్, అప్పారావు, ఇందిరా వంశీ పాల్గొన్నారు.

ఒకేసారి ఫ్లైఓవర్లు, మెట్రో

... 5వ పేజీ తరువాయి

చర్చ సాగిందన్నారు. తొలిదశలో విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి కొమ్మాది వరకు మెట్రో నిర్మించాలని ప్రతిపాదించామన్నారు. ఫ్లైవోవర్లు, మెట్రో కలిపి చేపట్టనున్న ప్రాజెక్టుకు కిలో మీటరుకు రూ.150 నుంచి రూ.200 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టులో భూమి నుంచి ఎనిమిది మీటర్ల ఎత్తులో ఫ్లైవోవర్లు, దానిపై మరో ఎనిమిది మీటర్ల ఎత్తులో మెట్రో ప్రాజెక్టు వస్తాయన్నారు. రెండూ కలిపి ఒకే ఫ్రేమ్‌లో రావాలంటే తగిన స్థలం ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారని, ఈ నేపథ్యంలో సాంకేతికంగా ఏది ఉపయోగకరంగా ఉంటుందనేది వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. బెంగళూరు, జైపూర్‌లో ఫ్లైఓవర్లు/మెట్రో కలిపి నిర్వహిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ రెండేళ్ల క్రితం రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో కొన్నిచోట్ల మార్పులు, చేర్పులు చేయాలన్న సూచనల మేరకు ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నదని అన్నారు. జీవీఎంసీ పరిధిలో తాగునీరు, పారిశుధ్యం, ఘన, జల వ్యర్థాల నిర్వహణ, ఇంజనీరింగ్ పనులు నాణ్యత తదితర అంశాలపై సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. టీడీఆర్ బాండ్ల జారీ అంశం చర్చకు వచ్చిందన్నారు. నగరంలో 100 గజాలలోపు స్థలాలను ఆక్రమణదారులకు ఆరేళ్ల క్రితం జారీచేసిన జీవో 296 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్ల జారీకి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పంచ గ్రామాల సమస్య పరిష్కారంలో భాగంగా సింహాచలం దేవస్థానానికి ఇవ్వడానికి గాజువాక, ములగాడ మండలాల్లో భూములను గుర్తించామన్నారు. అదేవిధంగా నగరానికి వచ్చే పర్యాటకులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని సీఎం ఆదేశించారన్నారు. కైలాసగిరి, రుషికొండ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, నగరాన్ని సందర్శించే పర్యాటకులు ఐదారు రోజులు ఇక్కడే ఉండేలా సదుపాయాలు పెంచుతామన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అల్లిపురం వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో నివాసితుల సమస్యలు, అంగడిదిబ్బ నివాసితులకు మరోచోట భూమి కేటాయింపు, ఇసుకకొండ సత్యనారాయణ స్వామి గుడికి వెళ్లే భక్తులకు వసతులు వంటి వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

'మహా' గోప్యత

.. 5వ పేజీ తరువాయి

ఆదేశిస్తూ వాయిదా వేశారు. అదే అంశానికి సంబంధించి జోన్-6లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఖర్చు చేసిన రూ.1.04 లక్షలు మొత్తాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించే అంశాన్ని ఈసారి ఎజెండాలో చేర్చడం చర్చనీయాంశంగా మారింది. వివిధ జోన్లలో నిర్వహించిన వేలంలో దుకాణాలను దక్కించుకున్న వారికి వాటిని అప్పగించడం, ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము వసూలు, పార్కింగ్ ఫీజు వసూలు, పార్కు లోపల క్యాంటీన్ అప్పగింత వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు. ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఒకరోజు ముందువరకూ బయటకు చెప్పకుండా గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా సభ్యులతోపాటు మీడియాకు మూడు రోజులు ముందుగానే సమాచారం ఇవ్వడంతో పాటు ఎజెండా కాపీ అందజేస్తారు. కానీ తాజా సమావేశానికి సంబంధించిన సమాచారంతోపాటు ఎజెండాను గురువారం మధ్యాహ్నం వరకూ బయటపెట్టకపోవడంపై అనేక రకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశం ఎజెండాను ముందుగానే మీడియాకు అందజేయడం వల్ల వాటిపై లోతుగా విశ్లేషణలతో కథనాలు రాస్తున్నారని, దీనివల్ల కొన్ని అంశాలపై తమ వ్యక్తిగత ఆలోచన మేరకు నిర్ణయం తీసుకోవడానికి వీలుండడం లేదని కొంతమంది సభ్యులు చెప్పడం వల్లే అధికారులు చివరి నిమిషం వరకూ ఎజెండాను బయటపెట్టలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమన్న ధోరణిలో ఆలోచిస్తూ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని బయటకు చెప్పొద్దంటూ అధికారులను ఆదేశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

జీవీఎంసీ బడ్జెట్‌పై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

దానితోపాటు దేనికి ఎంత ఖర్చుపెడుతున్నామనే వివరాలను స్పష్టంగా బడ్జెట్ ముసాయిదాలో పేర్కొనాలని సూచించారు. గొప్పల కోసం భారీ బడ్జెట్‌ను పెట్టి ఆచరణలో విఫలమైతే విమర్శలు ఎదుర్కొనాల్సి ఉంటుందని కమిషనర్ అన్నట్టు తెలిసింది. అన్ని విభాగాల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత జనవరి నాటికి ముసాయిదాను తయారుచేసి, స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ ఆమోదం తర్వాత ప్రభుత్వానికి పంపించనున్నారు.

భూముల రీ సర్వేకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేశారు. ఆ రాళ్లపై అప్పటి సీఎం జగన్ బొమ్మ ముద్రించారు. వీటిలో 82,327 రాళ్ల పాతడం పూర్తిచేయగా, ఇంకా 7,209 రాళ్లు మిగిలి ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో సర్వే రాళ్లపై వేసిన జగన్ బొమ్మలు తొలగించే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నది. భూమిలో పాతిన ప్రతి రాయిని బయటకు తీసి దానిపై ఉన్న జగన్ బొమ్మ తొలగించి మళ్లీ పాతాల్సి ఉంటుంది.

టన్ను ఇసుక రూ.750

... 5వ పేజీ తరువాయి

అందుబాటులోకి రానున్నాయి. ఒకవేళ డీలర్ల ఎంపికలో జాప్యం జరిగితే 17 లేదా 18వ తేదీల నుంచి విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించినట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. కొత్తగా అందుబాటులోకి రానున్న డిపోలలో 10 టన్నుల వరకు ఇసుక అందించాలని కమిటీ తీర్మానించింది. అంతకంటే ఎక్కువ అవసరం ఉన్న బిల్డర్లు/కాంట్రాక్టర్లు శ్రీకాకుళం, రాజమండ్రిల్లో రీచ్‌ల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజమండ్రి రీచ్‌లో టన్ను ఇసుక రూ.80 నుంచి రూ.90కు ఇస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని రీచ్‌లలో టన్ను రూ.200కు అందిస్తున్నారు. రాజమండ్రిలో మాదిరిగా శ్రీకాకుళం జిల్లాలోని రీచ్‌లలో టన్ను రూ.100 కంటే తక్కువకు సరఫరా చేయాలని జిల్లా యంత్రాంగం కోరుతుంది. ఇదిలావుండగా జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు రోజుకు సగటున 500 టన్నుల ఇసుక అవసరం. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపారు. గురువారం లేదా శుక్రవారం నుంచి ఇళ్ల నిర్మాణాలకు ఇసుక రవాణా మొదలు పెట్టాలని నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు.

ఫ్లైఓవర్‌పై ఎందుకంత నిర్లక్ష్యం!

» అగనంపూడి సమీపంలో పుట్‌పాత్‌తో పాటు డివైడర్ మరమ్మతులకు గురైనా పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

» తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు, పాదచారులు



అగనంపూడి ఫ్లైఓవర్



ధ్వంసమైన పుట్‌పాత్..



విరిగిపోయిన రెయిలింగ్

అగనంపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి సమీపంలో గల ఫ్లైఓవర్ అధ్వానంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా నిర్వహణ పనులు చేపట్టక పోవడంతో ఫ్లైఓవర్ పొడవునా ఉన్న పుట్‌పాత్‌తో పాటు డివైడర్ మరమ్మతులకు గురైంది. డివైడర్, ఫుట్‌పాత్‌పై అమర్చిన పలకలు పూర్తిగా విరిగిపోయాయి. పలుచోట్ల పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. వాహన చోదకుల రక్షణ కోసం బ్రిడ్జికి రెండువైపులా ఏర్పాటు చేసిన రెయిలింగ్ 50 శాతం మేర విరిగిపోయింది. కనీసం పెయింటింగ్ పనులు కూడా చేపట్టకపోవడంతో ఫ్లైఓవర్ కళావిహీనంగా దర్శనమిస్తోంది. ఫుట్‌పాత్ ధ్వంసం కావడంతో పాదచారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం ఈ రోడ్డు భారీ వాహనాలతో రద్దీగా ఉంటుండడంతో పాదచారులు ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించేందుకు భీతిల్లుతున్నారు. కాగా రక్షణ కోసం ఏర్పాటు చేసిన రెయిలింగ్ విరిగిపోవడంతో రాత్రి వేళల్లో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సుమారు పాతికేళ్లు గడుస్తున్నా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్లైఓవర్ నిర్వహణ గురించి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లైఓవర్‌కు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్వహణ పనులు చేపట్టాలి

-ఏదూరి పైడిరాజు, ఫార్మాసిటీ పునరావాస కాలనీ



మరమ్మతులకు గురైన ఫ్లైఓవర్ బ్రిడ్జికి తక్షణమే నిర్వహణ పనులు చేపట్టాలి. బ్రిడ్జిపై గల ఫుట్‌పాత్, డివైడర్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. రెయిలింగ్ విరిగిపోవడంతో ఫుట్‌పాత్‌కు పెద్ద పెద్ద రంధ్రాలు పడడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెయిలింగ్ విరిగిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నిర్వహణ పనులు చేపట్టాలి.

ఆనంద్ మృతిపై అనుమానాలు

ఉజ్బెకిస్తాన్‌లో కంపెనీ యాజమాన్యమే హతమార్చిందని మృతుని సోదరుడు ఆరోపణ



పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన ఆనంద్ కుటుంబ సభ్యులు

గాజువాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉజ్బెకిస్తాన్‌లో మృతి చెందిన కొప్పనాతి ఆనంద్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి సోదరుడు సతీశ్ ఆరోపించారు. రెండు నెలల క్రితమే ఉపాధి నిమిత్తం ఉజ్బెకిస్తాన్ వెళ్లిన తన సోదరుడు ఎప్పటికప్పుడు ఫోన్ చేసి అక్కడ తాను పడుతున్న ఇబ్బందులను చెబుతూ బాధపడేవాడని తెలిపారు. తనను తిరిగి ఇండియాకు పంపేయాలని ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పేవాడని ఆయనన్నారు. ఆటోనగర్‌లోని ఏజెంట్ వద్ద ఆనంద్ పడుతున్న ఇబ్బందులను వివరించినా ఆయన స్పందించలేదని సతీశ్ వాపోయారు. ఉజ్బెకిస్తాన్‌లో తాను పడుతున్న ఇక్కట్లను వివరిస్తూ ఆనంద్ పంపిన వీడియో, ఆడియోలను చూసి తాము ఆందోళనకు గురయ్యామన్నారు. ఆ వీడియో, ఆడియోలను ఆనంద్ తన గ్రూప్ సభ్యులకు వాట్సాప్‌లో షేర్ చేయడం సంబంధిత కంపెనీ యాజమాన్యానికి తెలియడం వల్లే తన సోదరుడిని హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నామని సతీష్ ఆరోపించారు.

స్పందించని ఏజెంట్..

ఆనంద్ మృతి చెందిన విషయం తమకు ఉజ్బెకిస్తాన్‌లో పని చేస్తున్న కొంతమంది వ్యక్తుల ద్వారా తెలిసిందని సతీశ్ తెలిపారు. తన సోదరుడు ఎలా మృతి చెందాడన్న విషయంపై ఆనంద్‌ను ఉపాధి కోసం పంపిన ఏజెంట్‌ను అడిగే ప్రయత్నం చేసినా స్పందించలేదన్నారు. తనకు ఈ విషయంతో సంబంధం లేదని ఏజెంట్ చెప్పాడని ఆరోపించారు. ఉజ్బెకిస్తాన్‌లో తన సోదరుడు ఎలా మృతి చెందాడో ఏజెంటును పిలిచి తెలుసుకోవాలని న్యూపోర్టు పోలీసులను కోరినా ఫలితం లేకుండా పోయిందని సతీశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద కుటుంబ సభ్యుల నిరసన

కాగా ఆనంద్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ గురువారం రాత్రి న్యూపోర్టు పోలీస్ స్టేషన్ బయట బైఠాయించి నిరసన తెలిపారు. మృతుని భార్య, తల్లితో పాటు కుటుంబ సభ్యులు, యాతపాలెం గ్రామస్తులు నిరసన చేపట్టారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు స్టేషన్ వద్ద నుంచి కదిలేది లేదని వారు స్పష్టం చేశారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు విక్రయించిన ఐదుగురి అరెస్టు

నిందితులు విజయవాడలో స్విగ్గీ డెలివరీ బాయ్స్

ఎండాడ (విశాఖపట్నం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో పార్ట్ టైమ్ జాబ్స్ పేరిట లింక్‌లు పంపించి, జనాన్ని మాయచేసి టాస్కల పేరుతో డబ్బులు గుంజిన వ్యవహారంలో పాలుపంచుకున్నందుకు ఐదుగురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

విశాఖ నగరానికి చెందిన ఓ వ్యక్తి ఫేస్‌బుక్ చూస్తుండగా ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ యాడ్ వచ్చింది. దాని లింక్ క్లిక్ చేసి, మొబైల్ నంబరుతో కనెక్టయ్యాడు. అనంతరం అతడి వివరాలను సేకరించిన ముఠా, మూడు లింక్‌లు పంపించి, అందులోని వీడియోలకు లైక్‌లు కొట్టాల్సిందిగా కోరింది. ఆ తర్వాత వాటికి సంబంధించిన స్క్రీన్ షాట్స్ పంపమన్నారు. అనంతరం టెలిగ్రామ్ యాప్‌లోని ఒక గ్రూపులో అతడి నంబర్‌ను యాడ్ చేసి టాస్కలు పూర్తిచేస్తే దండిగా డబ్బు సంపాదించవచ్చునని ఆశ చూపించారు. ఇలా ఇన్వెస్ట్‌మెంట్ పేరిట పలు దఫాలుగా రూ.2,00,160 కట్టించుకుని మోసం చేశారు. ఇలాగే మరికొంతమంది నుంచి నిందితులు మొత్తం రూ.38,43,455 కొట్టేశారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇందులో విజయవాడకు చెందిన ఐదుగురిని నిందితులుగా గుర్తించారు. వారంతా స్విగ్గీలో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. సైబర్‌క్రైమ్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలు అమ్ముకున్నట్టు వారు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి, విశాఖ తీసుకువచ్చిన పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరగాళ్లకు విక్రయించిన బ్యాంకు ఖాతాలను పరిశీలించగా వాటిపై ఏపీ, తెలంగాణతో పాటు 14 రాష్ట్రాల్లో 93 కేసులు నమోదైనట్టు గుర్తించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

ఎన్.ఎ.డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌టీఎల్ సబ్ స్టేషన్ మాధవధార 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కనకమహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీశాంతి ల్యాండ్ మార్క్ ఏరియా, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏరియా, మహాత్మా కాలనీ పార్కు, వంశీనగర్, జీబీఎస్ ఏరియా, వుడా అపార్ట్‌మెంటు, గంగా గోదావరి అపార్ట్‌మెంట్సు, అప్పయ్యనగర్, రైవాడ పంప్ హౌస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చినముషిడివాడ పరిధిలో..

పెందుర్తి: చినముషిడివాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గొల్లవిల్లిపాలెం, ఎల్ఐసీ కాలనీ, భవానీనగర్, పాపయ్యరాజుపాలెం, పాత ఊరు, శివగాయత్రీనగర్, ఆర్టీసీ లేఅవుట్, టీసీ కాలనీ, సాయిసౌదానగర్ ఫేజ్-1, 2, సూర్యానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో విద్యుత్ దీపాలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కూర్మన్నపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారుల్లో చీకటి పడితే అంధకారం అలముకుంటుండడంతో ప్రయాణికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'అంధకారంలో దువ్వాడ రైల్వేస్టేషన్ పరిసరాలు' శీర్షికతో కథనం రావడంతో వీఎస్ఈజెడ్ అధికారులు స్పందించారు. వీఎస్ఈజెడ్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏడీసీ కోడూరు వెంకట ప్రసన్నకుమార్ సంస్థకు చెందిన సిబ్బందిని పంపించి ఈ మార్గంలోని విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేయించారు. దీంతో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలపై పొదల తొలగింపు

దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారానికి వెళ్లే బ్రిడ్జిపై ఉన్న విద్యుత్ స్తంభాలకు పొదలు అల్లుకోవడంతో ఏదైనా ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వీఎస్ఈజెడ్ అధికారులకు సమాచారం అందించారు. అందుకు స్పందించిన వీఎస్ఈజెడ్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏడీసీ కోడూరు వెంకట ప్రసన్నకుమార్ తమ సంస్థకు చెందిన విద్యుత్ సిబ్బందిని పంపి స్తంభాలపై అల్లుకుపోయిన పొదలను తొలగించారు.

శిథిలమైన కాలువలను పరిశీలించిన ఏఎంహెచ్‌వో

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 68వ వార్డులో శిథిలమైన కాలువలను గురువారం గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. అక్కిరెడ్డిపాలెం, మింది, వివేకానందకాలనీ, పంచవటి కాలనీ పరిసర ప్రాంతాల్లో శిథిలమై పారిశుధ్య సమస్యలను సృష్టిస్తున్న కాలువలను ఆయన చూశారు. ఆయా కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉన్న చోట పూడిక తీసి మందులు చల్లాలని, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, సంద్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ తదితరులు అధికారులకు కోరారు.

'ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి రవి కోరారు. ఇటీవల కార్మిక వర్గం నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మికులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని పేర్కొన్నారు.

కొండవాలు ప్రాంతంలో విత్తన బంతులు వేసిన విద్యార్థులు

గోపాలపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, స్థానిక బాలాజీ స్కూల్ విద్యార్థులు పలు రకాల వృక్ష జాతుల విత్తనాలతో తయారు చేసిన విత్తన బంతులను బంక్ కూడలి సమీపంలోని కొండవాలు ప్రాంతంలో విసిరారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, విత్తన బంతుల తయారీ.. పంపిణీ వంటి కార్యక్రమాలను తాము నిర్వహిస్తున్నట్టు జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు, తదితరులు

పెదగంట్యాడ, నవంబరు 7: ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 65వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకతీయ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వనమోదు ద్వారా చేకూరే ప్రయోజనాలను అందరికీ తెలియజేసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు అధిక సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ 65వ వార్డు నుంచి అత్యధికంగా సభ్యత్వాలను నమోదు చేయాలని కోరారు.

కార్యక్రమంలో టీడీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు రట్టి వాసు, ఎస్.సుజాత, కె.స్వరూపారాణి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ అత్యుత్తమ వైద్యం: 'పల్లా'

అగనంపూడి: పేదలందరికీ అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పరిధి ఇ-మర్రిపాలేనికి చెందిన దుల్ల ముత్యాలమ్మ అనే మహిళ అనారోగ్యం బారినపడి ఇటీవల వైద్య సేవలు పొందింది. ఇందుకు గాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ1.43 లక్షల చెక్కును ఆయన బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కష్టం వస్తే ఆ కుటుంబానికి చంద్రబాబు భరోసాగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు విందుల రాజు, రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం: ఎమ్మెల్యే గణబాబు



ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీదారులతో మాట్లాడుతున్న గణబాబు

మల్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద 61, 62 వార్డులకు సంబంధించి గురువారం నిర్వహించిన ప్రజా దర్బర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పెన్షన్లు, ఇంటి పన్నుల మార్పులు, కొత్తగా ఇంటి పన్నులు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, తదితర సమస్యలకు సంబంధించి ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలు అందుతున్నాయన్నారు. అలాగే ప్రజలందరూ సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని గణబాబు పేర్కొన్నారు. ఈ పథకం కోసం లబ్ధిదారుడికి రూ.లక్షా అరవై వేలు ఖర్చవుతుందని, ఇందులో సదరు వ్యక్తి రూ.లక్ష చెల్లిస్తే.. ప్రభుత్వం రూ.అరవై వేల సహకారాన్ని అందిస్తుందన్నారు. ముందుగా ఆయన సోలార్ పథకానికి సంబంధించిన వాల్ పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ బి.రాము, ములగాడ తహసీల్దార్ భుజంగరావు, టీడీపీ నాయకులు మజ్జి సోమేశ్, మజ్జి మాలినాయుడు, నీలాపు జోగి, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ



గాజువాకలో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ సుధాకరరావు, తదితరులు

గాజువాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకరరావు అన్నారు. కేన్సర్ నివారణపై గురువారం స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి కొన్ని పరీక్షలు చేస్తారన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఈ పరీక్షలను చేయించుకోవాలని కోరారు. ఆరోగ్యం విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గాజువాక పీహెచ్‌సీ నుంచి చినగంట్యాడ వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగ అప్పారావు, సిబ్బంది రాము, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: సరైన అవగాహన, సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తించడం ద్వారా కేన్సర్ వ్యాధిని నివారించడం సాధ్యపడుతుందని బెహరా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిందుమతి అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని బెహరా నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఈ వ్యాధి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నరవలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కేన్సర్‌ను ప్రాథమిక దశలో ఏ విధంగా గుర్తించాలి, తీసుకోవాల్సిన చికిత్సా విధానం, తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కేన్సర్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారపు నియమాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దివ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడిన యువకుడి మృతి

హత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు



మృతి చెందిన దుర్గారావు (ఫైల్ ఫొటో)

పెందుర్తి-రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేపగుంట సమీపంలోని శానాతివానిపాలెం వద్ద ఈ నెల ఐదో తేదీ రాత్రి తొమ్మిది ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొబ్బర దుర్గారావు (25) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కర్రి వెంకట జగదీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గారావు తల్లి సత్యవతితో కలిసి నివసిస్తున్నాడు. ఐదో తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన దుర్గారావు స్థానికులను, బంధువులను దూషించాడు. అప్పటికే అక్కడ క్రికెట్ ప్లేయర్ విరాట్ కోహ్లి జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న కొంతమంది యువకులు దుర్గారావును వారించడానికి యత్నించగా వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో దుర్గారావును సమీప బంధువు బొబ్బర నూకరాజు, మరికొంతమంది గట్టిగా మందలించడంతో ఘర్షణ మరింత పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో దుర్గారావు కింద పడిపోవడంతో తలకు దెబ్బతగిలి రక్తస్రావమవ్వడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు నూకరాజుతో పాటు ఆయన కుమారుడు, కుమార్తె, సోదరుడు, వారిద్దరి కుమారులను అదుపులోకి విచారిస్తున్నారు. ఇరు వర్గాల మధ్య ఉన్న పాత గొడవల వల్లే ఈ ఘర్షణ చోటుచేసుకున్నట్టు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. తలకు తీవ్ర గాయమై దుర్గారావు మృతి చెందినందున హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

మూడున్నర కిలోల గంజాయి పట్టివేత

గోపాలపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కె.సతీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతానికి చెందిన బి.ఓంకార్ (25) అనే యువకుడు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తెస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు గురువారం ఉదయం సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద వారు మాటు వేసి ఓంకార్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మూడున్నర కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

'ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'

పెదగంట్యాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు కోరారు. సీతానగరంలో గురు వారం రాత్రి జరిగిన మండలస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా వ్యవహరించాలన్నారు. పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.సోమునాయుడు మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పెంటిరాజు, నంబారు పైడియ్య, ఎం.పెంటయ్య, జి.పోలయ్య, జి.ముత్యాలు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలకు శ్రీకారం



పెందుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని శ్రీవారికి తులసీపూజ చేసి సప్తహారతులు ఇచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు నడుపూరు విద్యార్థినులు

పెదగంట్యాడ, నవంబరు 7: నడపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గత నాలుగు రోజులుగా నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. నడుపూరు హైస్కూల్ నుంచి గెడ్డం హాసిని, కె.ఉజ్వల, ఎస్.భారతి ఎంపికైనట్టు గురువారం ఫౌండేషన్ ప్రకటించింది. వీరిని స్కూల్ హెచ్ఎం ఆర్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఎం.పెంటయ్య, తదితరులు అభినందించారు.

బేస్ బాల్ బాలికల జట్టుకు విద్యార్థిని..

అగనంపూడి: రాష్ట్ర స్థాయి బేస్ బాల్ బాలికల జట్టుకు స్థానిక ఏటీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సాలాపు రోషిణి ఎంపికైంది. ఈ నెల తొమ్మిది నుంచి తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో రోషిణి పాల్గొననున్నది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోషిణిని స్కూల్ వ్యవస్థాపకులు పీఎం కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్, తదితరులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

వేపగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పవర్ హౌస్ విద్యుత్ కార్యాలయం వెనక ఉన్న అయ్యప్ప స్వామి పీఠం ప్రతినిధులు గురువారం నర్సింగబిల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.50,116ను విరాళంగా ఆలయ ట్రస్టు మెంబర్, కార్పొరేటర్ రాపర్తి కన్నాకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన పీఠం ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
● **ధూం, ధాం:** శారద, మోహిని (గాజువాక)
● **జితేందర్‌రెడ్డి:** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **క:** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర:** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర:** రమాదేవి, శ్రీకన్య (గాజువాక), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)


ఉల్లిపాయలు సోలాపూర్ 54, ఉల్లిపాయలు కర్నూల్ 40, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 38, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 34, క్యారెట్ 54, దొండకాయలు 28, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది) 60, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరు చిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (మీడియం) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240











ఫామ్‌లో ఇంజనీర్

ఉద్యోగం వదిలి కోళ్ల పెంపకం చేపట్టిన యువకుడు

- సొంతూరిలో మూడు ఎకరాల్లో ఫామ్ ఏర్పాటు
- ఒక్కో కోడి పుంజు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు విక్రయం
- నెలకు రూ.80 వేల వరకూ ఆదాయం

ఉన్నత చదువు చదువుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడాలని భావించే ఈ రోజుల్లో సొంతూరిలో స్వశక్తితో ఎదుగుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ యువ ఇంజనీర్. ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా సుమారు రూ.30 లక్షలతో కోళ్ల పెంపకం ప్రారంభించి నాటు కోళ్లను పెంచుతూ నెలకు రూ.80 వేల ఆదాయం పొందుతున్నాడు. - మాకవరపాలెం-ఆంధ్రజ్యోతి



కోళ్లకు మేత వేస్తున్న యువ ఇంజనీర్

మాకవరపాలెం గ్రామానికి చెందిన వడ్లమూడి బాలాజీ కుమార్ సివిల్ ఇంజనీరింగ్ చదివాడు. 2008 సంవత్సరం నుంచి విజయవాడలో ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేశాడు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ కంపెనీ మూతపడింది. దీంతో స్వగ్రామానికి వచ్చేశాడు. తన వద్ద ఉన్న డబ్బులతో పీపీ అగ్రహారం రోడ్డులో మూడు ఎకరాల మెట్ట భూమిని కొనుగోలు చేశాడు. తనకు వచ్చిన ఆలోచనను స్నేహితులతో పంచుకున్నాడు. వారి సహాయంతో రెండేళ్ల క్రితం ఆ భూమిలో విజ య్ క్లో ఫామ్ ఏర్పాటుచేశాడు. ముం దుగా పలు జాతులకు చెందిన కోళ్లను తూర్పుగోదావరి జిల్లా నుంచి తీసుకు వచ్చాడు. అనంతరం తన సొంత ఫామ్‌లోనే రూ.2 లక్షలతో కోడిగుడ్లను పొదిగే విద్యుత్ యంత్రాన్ని ఏర్పాటుచేశాడు. ఈ యంత్రం ద్వారా 21 రోజుల్లోనే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. అనంతరం వాటిని పది రోజుల వరకు విద్యుత్ కాంతులు ఉన్న చోట ఉంచి తరువాత కోడిపెట్టల వద్ద వదులుతున్నారు. ఇలా ఇప్పటికే అతని కోళ్లఫామ్‌లో పలు జాతులకు చెందిన 700 కోళ్లు ఉన్నాయి. ఒక్కొక్క కోడిపుంజు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. వీటిని భీమవరం, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతవాసులతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వాసులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే 70 పందెం కోళ్లను విక్రయించారు. అలాగే జాతి కోడిగుడ్డు రూ.300, ఒకరోజు జాతి కోడి పిల్ల రూ.400, నెల రోజుల కోడి పిల్ల రూ.700 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిని చాలామంది కొనుగోలు చేసి పందేల కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ ఫామ్ ద్వారా నెలకు సుమారు రూ.80 వేల ఆదాయం వస్తుంది.



కోడి పిల్లలను పొదిగే విద్యుత్ యంత్రం



పొదిగిన కోడిపిల్లలను ఒక తొట్టెలో ఉంచిన దృశ్యం



పలు రకాల జాతులకు చెందిన కోళ్లు

ఆదాయం బాగుంది

సివిల్ ఇంజనీర్ ఉద్యోగం కంటే కోళ్ల ఫామ్ వ్యాపారం బాగుంది. రోజూ కోళ్లఫామ్‌లో కష్టపడి పనిచేయడంతో ఆరోగ్యం కూడా బాగుంది. ఎంతో టెన్షన్‌తో ఉద్యోగం చేసేవాడిని. ఇప్పుడు కోళ్ల ఫామ్‌లో సంతోషంతో పాటు నలుగురికి పని కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. జాతి పుంజులు కావాలని ఇతర జిల్లాల నుంచి ఫోన్లు చేస్తుంటారు. భవిష్యత్తులో గొర్రెల ఫామ్ ఏర్పాటుచేసే ఆలోచన ఉంది.

- వడ్లమూడి బాలాజీకుమార్

డీఎస్సీ ఉచిత శిక్షణకు 10న పరీక్ష


ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం ఈ నెల 10 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 12 శిక్షణ కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, ఫొటో సరిగా లేకుంటే పాస్‌పోర్టు సైజ్ ఫొటో, గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 0891 2551001 నంబరులో సంప్రతించాలన్నారు.











పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం

- సీఐఐ జోనల్‌స్థాయి సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే పారిశ్రామిక వేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సీఐఐ 4 వ జోనల్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలోని ప్రధానాంశాలను సభ్యులకు వివరించారు. విశాఖ అభివృద్ధికి ఇప్పటికే రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని, దీనికి ప్రభుత్వం సానుకూల దృక్పథం తో ఉందని, కొద్దిరోజుల్లో కార్యాచరణ ప్రారంభమవుతుందన్నారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చే నాటికి జిల్లాలోని అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తిచేయాలని సీఎం ఆదేశించారన్నారు. ఈ మేరకు వీఎంఆర్డీఏ, జీవీఎంసీ సహాయంతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రోడ్ల అనుసంధానంపై ప్రధానంగా దృష్టిసారిస్తామని, ట్రాఫిక్ సమస్య తొలగించి, వాహన రద్దీని నియంత్రించేలా ఎక్స్‌ప్రెస్ కారిడార్లు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లను విస్తరిస్తామని, రోడ్‌కం మెట్రో కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని వీటిని కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపామన్నారు. దువ్వాడ, అచ్యుతాపురం, గంగవరం పోర్టు తదితర పారిశ్రామిక వాడల నుంచి సులభంగా రవాణా జరిగేలా రోడ్లను అభివృద్ధి చేసి అనుసంధానిస్తామన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ పరిశ్రమలకు సమీపంలో ఉన్న ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రజలు, ఉద్యోగుల ప్రాణరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సీఐఐ ఏపీ సెక్టార్ చైర్మన్ మురళీకృష్ణ, విశాఖపట్నం జోన్ చైర్మన్ గ్రంధి రాజేష్, సభ్యులు పలు అంశాలపై సూచనలు అందజేశారు.



సమావేశంలో కలెక్టర్, సీపీ, సీఐఐ ప్రతినిధులు

100 రోజుల ప్రణాళికలో ముందంజలో ఉండాలి

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



గొల్లలపాలెంలో ఇళ్లను పరిశీలిస్తున్న తాతయ్యబాబు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం అమలుచేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు ముందంజలో ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆదేశించారు. గురువారం జీవీఎంసీ జోనల్ 4 కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న పథకమన్నారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఈ విషయంలో కాంట్రాక్టర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా సాధ్యమైనన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ, నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియ కొనసాగుతున్నందున త్వరలో బిల్లులు విడుదల చేస్తారన్నారు. సమీక్షలో సంస్థ చీఫ్ ఇంజనీరు జీవీ.ప్రసాద్, విశాఖ, అనకాపల్లి జిల్లాల పీడీలు ఆళ్ల శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. తొలుత సబ్బవరం మండలం గొల్లలపాలెం, తదితర లేఅవుట్‌లను సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడా పాలసీ

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జాన్ గ్యాలియట్



మాట్లాడుతున్న జాన్ గ్యాలియట్

కొమ్మాది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కూటమి ప్రభుత్వం ఉత్తమ క్రీడా పాలసీని రూపొందించిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జాన్ గ్యాలియట్ వివరించారు. కొమ్మాది క్రీడా స్టేడియంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకుముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు. అందరికీ క్రీడలు అందుబాటులోకి తేవడం, ప్రతిభను వెలికితీయడం, స్పోర్ట్సు ఎకో సిస్టం, గ్లోబల్ విజిబిలిటీ అనే లక్ష్యాలతో పాలసీని రూపొందించారన్నారు. గ్రామస్థాయి నుంచి క్రీడల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ఉద్యోగాల్లో ఉన్న స్పోర్ట్సు కోటాను మూడు శాతానికి పెంచడం క్రీడారంగానికి మరింత ఊతమిస్తుందన్నారు. ఇంత మంచి పాలసీని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, క్రీడాశాఖా మంత్రి రాంప్రసాద్, శాప్ చైర్మన్ రవినాయుడు, క్రీడాశాఖ సెక్రటరీ వినయ్‌చంద్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.సూర్యనారాయణ, మాణిక్యాలు, వెంకటేశ్వరావు, జయరాం, గ్రీష్మ, నారాయణరావు, కోచ్‌లు పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీలకు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్



విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత స్థాయిలో సివిల్ సర్వీస్ ఉద్యోగులకు నిర్వహించే టెన్నిస్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొనేందుకు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేశ్ అర్హత సాధించారు. ఏపీలో జరిగిన అన్ని మ్యాచ్‌లలో గెలిచి ఈ పోటీలకు వెళుతున్నారు.

పార్కుల నిర్వహణ పనులపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ సమీక్ష

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ పార్కుల నిర్వహణ పనులపై కమిషనర్ విశ్వనాథన్ ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ ఎరీనా, సెంట్రల్ పార్క్, సీ హ్యారియర్ మ్యూజియం, చిల్డ్రన్ ఎరీనాల నిర్వహణ పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. చీమలాపల్లి, ఎండాడ కన్వెన్షన్ సెంటర్ పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, ఈఈలు ఎస్‌వీఎస్ఎన్ రాజు, బలరామరాజు, సుధీర్ అధికారులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి దుర్మరణం



భాస్కరరావు మృతదేహం

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీ ఢీకొనడం తో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పెద్దిపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు. విశాఖ నుంచి విజయనగరం వైపు బైక్‌పై వెళ్తున్న వంక భాస్కరరావు (55) పెద్దిపాలెం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించే యత్నంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ప్రాజెక్టులపై సముద్రంలో మత్స్యకారుల నిరసన



సముద్రంలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

సాగర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసియా గ్యాస్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు సముద్రంలో పడవలతో ర్యాలీ, తీరంలో నిరసన వ్యక్తంచేశారు. సమత, ఎంఎంఅండ్‌పీ, ఏపీ ఎండీడీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పడవల ర్యాలీలో మత్స్యకార, గిరిజన, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమత కోఆర్డినేటర్ సతీశ్ కుమార్ మాట్లాడుతూ సముద్రాల్లో గ్యాస్ నిక్షేపాల కోసం చేపడుతున్న ప్రాజెక్టులు తక్షణమే నిలిపివేయాలన్నారు. దీనివల్ల సముద్రం కలుషితం కావడంతో పాటు మత్స్యకారుల జీవనోపాధి పోతుందని ఆరోపించారు. సముద్ర ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.